

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


నేపాల్ వరదల్లో కైలాస యాత్రికులు గల్లంతు.. ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న తెలుగు కుటుంబాలు




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 238 | గురువారం 03 - 09 -2026 | పేజీలు : 12 | వెల-3




# గోదారమ్మకు సాష్టాంగ ప్రణామం

## కాలువలో నిల్చొని చంద్రబాబు జలహారతి..

పాయకరావుపేట వద్ద ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేసిన సీఎం చంద్రబాబు

2లో

కాలువలోకి దిగి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు, జలహారతి

నాలుగు జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు

గోదావరి జలాలకు అడుగడుగునా నీరాజనాలు పలికిన ఉత్తరాంధ్ర ప్రజలు

జలాలను ఉత్తరాంధ్రకు తెచ్చిన చంద్రబాబుకు రైతుల కృతజ్ఞతలు

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల దాహార్తిని తీరుస్తూ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా పయనించి వచ్చిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అపూర్వ రీతిలో స్వాగతం పలికారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి వస్తున్న గోదావరి జలాలకు, స్వయంగా కాలువలోనే నిల్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న గోదారమ్మకు పుష్పాలు సమర్పించి, జలహారతి ఇచ్చి తన కృతజ్ఞతను చాటుకున్నారు. పవిత్ర గోదావరి జలాలను శిరస్సుపై చల్లుకున్న అనంతరం, ఉద్విగ్నభరిత వాతావరణంలో గోదావరి ప్రవాహానికి సాష్టాంగ నమస్కారం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. బుధవారం పాయకరావుపేటలో జరిగిన ఈ చారిత్రక కార్యక్రమంలో భాగంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, నారాయణ, అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి, ఎంపీలు చింతకాయల విజయ్, సీఎం రమేశ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన గోదావరి జలాలను ఉత్తరాంధ్ర జిల్లాలకు విడుదల చేశారు.



అనకాపల్లి బ్యూరో ఛీఫ్ నందిపత్రిక

## నరసరావుపేట జేఎన్టీయూలో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్



పల్నాడు జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్

2లో

నరసరావుపేట జేఎన్టీయూకేలో నూతన హాస్టల్ భవనాల ప్రారంభం

రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం

గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో వసతి గృహాల నిర్మాణం

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు పల్నాడు జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నరసరావుపేట మండలం కాకాని గ్రామ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో (జేఎన్టీయూ కాకినాడ పరిధి) నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు. రూ. 70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థినీ విద్యార్థుల కోసం ఆధునిక సౌకర్యాలతో ఈ వసతి గృహాలను నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం తర్వాత హాస్టల్ ప్రాంగణాన్ని, గదులను కలియతిరిగి విద్యార్థులకు

# స్థానిక ఎన్నికల్లో ఉనికి కోసం ఆరాటం

## జగన్‌పై మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి విమర్శలు

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం



2లో

# గొల్లగుప్పలో మలేరియాతో బాలిక మృతి

పోలవరం జిల్లా ఎట పాక మండలం గొల్ల గుప్పలోని గ్రామస్తులం దరికీ తక్షణం వైద్య పరీ క్షలునిర్వహించాలని అధి కారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు.

2లో

గ్రామస్థులందరికీ ఆరోగ్య పరీక్షలు చేండి అధికారులకు డిప్యూటి సిఎం పవన్ ఆదేశం



## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



2లో

గోదావరి జలాలు తెచ్చిన చంద్రబాబుకు

# ఉత్తరాంధ్ర రైతుల జేజేలు..



దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు

పాయకరావుపేట వద్ద నీటిని విడుదల చేసి జలహారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు

4 జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు

2లో

ఇక ఉత్తరాంధ్రకే వలసలు వస్తాయన్న ముఖ్యమంత్రి

గోదావరి జలాలు తీసుకొచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు

దశాబ్దాల కాలం నాటి కల సాకారమైంది. ఉత్తరాంధ్ర బీళ్లకు జీవం పోసేందుకు గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ తరలివచ్చింది. ఈ చారిత్రక ఘట్టంతో పులకించిపోయిన ఉత్తరాంధ్ర రైతులు, ప్రజలు.. తమ ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మనసారా కృతజ్ఞతలు తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి గోదావరి జలాలను విడుదల చేసిన ముఖ్యమంత్రి, ఈ అపూర్వ ఘట్టానికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచారు. బుధవారం

# ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు.. ఇది చంద్రబాబు విజన్: మంత్రి నిమ్మల



పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు చేరిన గోదావరి జలాలు

ఇది చంద్రబాబు ముందుచూపు వల్లే సాధ్యమైందని కొనియాడిన మంత్రి నిమ్మల

2లో

గత ఐదేళ్లలో లెఫ్ట్ కెనాల్‌పై వైసీపీ ప్రభుత్వం తట్ట మట్టి కూడా వేయలేదని ఆరోపణ

పోలవరం ఆలస్యం వల్ల ఈ ఏడాది 350 టీఎంసీల గోదావరి నీరు వృథా అయ్యిందని విమర్శ

పట్టిసీమ, పురుషోత్తపట్నంలను విమర్శించిన జగన్ అవే పథకాలపై ఆధారపడాల్సి వచ్చిందని వ్యాఖ్య

# తెలంగాణ విమానాశ్రయాలను త్వరగా పూర్తి చేయండి



## కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సిఎం రేవంత్ భేటీ

2లో

తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్రమంత్రికి..

# గోదావరి జలాలు తెచ్చిన చంద్రబాబుకు ఉత్తరాంధ్ర రైతుల జేజేలు..

పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఉత్తరాంధ్ర భూముల్లోకి అడుగుపెట్టిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చారు. అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న పవిత్ర జలాలను శిరస్సున చల్లుకుని, భావోద్వేగంతో కాలువలో నిల్చుని పుష్పాలు, పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం గోదావరి తల్లికి సాష్టాంగ నమస్కారం చేసి తన ప్రణామం అర్పించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన స్థానిక రైతులు, మహిళలు హారతులు పడుతూ, పూలు చల్లుతూ గోదారమ్మకు స్వాగతం పలికారు.

**ఉత్తరాంధ్ర ఉన్నతాంధ్రగా మారుతుంది: సీఎం** అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. “ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు వచ్చాయి. ఇక ఈ ప్రాంతంలోని బీళ్లన్నీ పంటలతో కళకళలాడతాయి. అన్నవరం సత్యదేవుడి ఆశీస్సులతో అనకాపల్లికి వచ్చిన గోదారమ్మను.. వచ్చే ఏడాదికి సింహాచలం అప్పన్న చెంతకు, ఆపై అరసవల్లి సూరీడి పాదాల వద్దకు తీసుకెళ్లి, వంశధార వరకు గోదావరి జలాలను తరలిస్తాం“ అని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా తొలి దశలో తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ కోసం ఇప్పటివరకు రూ.4,192 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ.800 కోట్లతో మిగిలిన పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ నీటితో విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక, తాగునీటి అవసరాల కోసం 23.44 టీఎంసీలు తరలించనున్నట్టు వివరించారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు** “2019లో వచ్చిన గొడ్డలి పార్టీ పోలవరం ప్రాజెక్టును సర్వనాశనం చేసింది. డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసింది. 2024లో ప్రజలు కూటమిని గెలిపించి పోలవరానికి శాప విముక్తి కలిగించారు“ అని చంద్రబాబు విమర్శించారు. ప్రతి నీటి చుక్క వెనుక ఇంజినీర్ల ప్రతిభ, కార్మికుల కష్టం, రైతుల నిరీక్షణ, నిర్వాసితుల త్యాగం ఉన్నాయని కొనియాడారు.

**అభివృద్ధికి చిరునామాగా ఉత్తరాంధ్ర** “గతంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లేవారు. ఇకపై ఉత్తరాంధ్రకే వలసలు వచ్చే పరిస్థితి కల్పిస్తాం. విశాఖ ఏఐ పట్నంగా, నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగా మారుతుంది. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలతో ఈ ప్రాంతం అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుంది“ అని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. డేటా సెంటర్లకు నీటి కొరత వస్తుందన్నది తప్పుడు ప్రచారమని, వాటికి అవసరమైన 5 టీఎంసీల కంటే ఎడమ కాలువ ద్వారా ఎన్నో రెట్ల నీరు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సభా వేదిక నుంచి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం, ప్రాజెక్టు కోసం కృషి చేసిన ఇంజినీర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు.. ఇది చంద్రబాబు విజన్: మంత్రి నిమ్మల

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తూ గోదావరి జలాలు ఈ ప్రాంతాన్ని తాకాయని, ఇది ముఖ్యమంత్రి, అపర భగీరథుడు చంద్రబాబు దార్శనికత వల్లే సాధ్యమైందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు చేరడం రాష్ట్ర జలవనరుల చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని ఆయన అభివర్ణించారు. బుధవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద సీఎం చంద్రబాబు గోదావరి జలాలకు హారతి పట్టడం తెలిసిందే. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నిమ్మల రామానాయుడు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కాకముందే, పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఉత్తరాంధ్రకు నీరందించాలన్న చంద్రబాబు ముందుచూపు వల్లే ఈరోజు ఈ ప్రాంత ప్రజల దాహం తీరుతోందని మంత్రి అన్నారు. “2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, 2026 నాటికి లెఫ్ట్ మెయిన్ కెనాల్ పూర్తి చేస్తామని మాట ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం గడువులోగా పూర్తి చేసి ఈ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకొచ్చాం“ అని ఆయన స్పష్టం చేశారు. ఈ రెండేళ్ల కాలంలోనే ఏలేరు, పంప, తాండవ, శారద, వరాహ వంటి ఐదు ప్రధాన నదులను, తొమ్మిది జాతీయ రహదారులను దాటుతూ కెనాల్ నిర్మాణంలో ఉన్న క్లిష్టమైన పనులను పూర్తి చేశామని తెలిపారు. కొమ్మరిలోవ వద్ద 100 మీటర్ల లోతైన కొండను తవ్వి కాలువను తీసుకురావడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నిమ్మల తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంచి చేసే కూటమి ప్రభుత్వానికి, రాష్ట్రాన్ని ముంచేసిన “గొడ్డలి పార్టీ“కి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని కోరుతూ మూడు కీలక విషయాలను ప్రస్తావించారు. “మొదటిది, గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌పై కనీసం ఒక్క తట్ట మట్టి పని చేయలేదు, అరబస్తా సిమెంట్ వాడలేదు, ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. అలాంటి పార్టీకి ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే హక్కు లేదు“ అని ఆరోపించారు. “రెండోది, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ అసెంబ్లీలో పట్టిసీమను ‘వట్టిసీమ‘ అని, పురుషోత్తపట్నం పనికిరాదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే ఆ పంపులను పీకేస్తానని హెచ్చరించారు. కానీ ఈరోజు అవే పట్టిసీమ పంపులు కృష్ణా డెల్టా ఆయకట్టును ఆదుకుంటున్నాయి. సూపర్ ఎల్ నినో సంవత్సరంలో కూడా 32 టీఎంసీల నీటిని అందించాం. అదేవిధంగా, ఆయన పీకేస్తానన్న పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారానే నేడు ఉత్తరాంధ్రకు నీళ్లు వస్తున్నాయి. ఇది చంద్రబాబు ముందుచూపునకు, గొడ్డలి పార్టీ విధ్వంసకర పాలనకు మధ్య ఉన్న తేడా“ అని మంత్రి విమర్శించారు. “మూడవది, 2019 నాటికి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశారు. ఆయన అధికారంలో కొనసాగి ఉంటే 2021కే ప్రాజెక్ట్ పూర్తయ్యేది. కానీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం, డయాఫ్రం వాల్ ధ్వంసం వంటి చర్యల వల్ల ప్రాజెక్టును నాశనం చేశారు. పోలవరం పూర్తయి ఉంటే, ఈ సూపర్ ఎల్ నినో సంవత్సరంలో కూడా గోదావరి నుంచి సముద్రంలో వృథాగా కలిసిన 900 టీఎంసీల వరద నీటిలో కనీసం 300 నుంచి 350 టీఎంసీలను కృష్ణా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు తరలించేవాళ్లం“ అని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ అసమర్థత వల్ల తెలుగు జాతి భారీగా నష్టపోయిందని, ఈ ముంచేసే గొడ్డలి పార్టీని ఉత్తరాంధ్ర ప్రజలు తరిమి తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# నేపాల్ వరదల్లో కైలాస యాత్రికులు గల్లంతు..

కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన పలువురు తెలుగు యాత్రికులు నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో గల్లంతయ్యారు. వీరిలో ప్రవాస భారతీయులు కూడా ఉండటంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆగస్టు 26న ఈ విపత్తు సంభవించినప్పటి నుంచి వారి గురించి ఎలాంటి సమాచారం లభించకపోవడంతో బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, సమాచారం చేరడంలో జాప్యం జరుగుతుండటంతో బాధితుల కుటుంబాలు ఆశతో ఎదురుచూస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఎన్నారై శ్రీధర్ అవ్వారి, ఆయన భార్య దీప్తి, 14 ఏళ్ల కుమారుడు అభినవ్ ఆగస్టు 13న ఈశా ఫౌండేషన్ బృందంతో కలిసి యాత్రకు వెళ్లారు. ఆగస్టు 26 నుంచి వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఈశా ఫౌండేషన్‌ను సంప్రదించారు. యాత్ర ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో, నేపాల్-చైనా సరిహద్దులోని ఇమ్మిగ్రేషన్ కేంద్రం వద్ద వారు వరదల్లో చిక్కుకున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారని దీప్తి సోదరుడి భార్య ప్రియాంక రాపాక వివరించారు. మణికొండకు చెందిన 38 ఏళ్ల ధన్‌పాల్ రెడ్డి ఆచూకీ కూడా ఇంకా లభ్యం కాలేదు. పుణే నుంచి వెళ్లిన 66 మంది యాత్రికుల బృందంలో తెలంగాణకు చెందిన వ్యక్తి ఈయన ఒక్కరే. వరదలు సంభవించిన రోజున నేపాల్ ఇమ్మిగ్రేషన్ సెంటర్ నుంచి ఆయన చివరిసారిగా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన ఆచూకీ కోసం బాధితులు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. చేతులు, భుజాలపై ఉన్న శివుడి టాటూల ద్వారా తన భర్తను గుర్తించవచ్చని ఆయన భార్య సుప్రియ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ బాధితుని కుటుంబ సభ్యులతో మాట్లాడి, తగిన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాకు చెందిన, ప్రస్తుతం ఖతార్‌లో నివసిస్తున్న ఎన్నారై చొప్పరపు రమేశ్‌బాబు సైతం ఇదే యాత్రకు వెళ్లి గల్లంతయ్యారు. మరోవైపు, ఇదే మార్గంలో యాత్రకు వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన రాజేశ్వరి అనే మహిళ, ఈ విపత్తు సంభవించడానికి నాలుగు రోజుల ముందే సురక్షితంగా తిరిగి రావడం గమనార్హం.

# తెలంగాణ విమానాశ్రయాలను త్వరగా పూర్తి చేయండి

సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు.ఆదిలాబాద్‌లో రన్ వే పైలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు.. సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. టెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డ లో ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి

## వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి

## సంక్షేమం అభివృద్ధిని ప్రజలకు పరిచయం చేసిన ఘనత వైయస్సార్ ఇదే మాజీ ఎమ్మెల్యే గంగుల





**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 2 నంది పత్రిక** సంక్షేమము, అభివృద్ధి ప్రజలకు అమడ దూరంలో ఉన్న సమయంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధిని ప్రజలకు పరిచయం చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డికి దక్కుతుందని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి కొనియాడారు. బుధవారం దివంగతనేత డా. వైయస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి గంగుల బ్రిజేంద్ర రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గంగుల విలేకరులతో మాట్లాడుతూ కేవలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకే పరిమితం కాకుండ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ అభిమానులు, ప్రజలు పండుగల వర్ధంతిని జరుపుకోవడం విశేషమన్నారు. వైయస్సార్ ముఖ్యమంత్రి కాక మునుపు రైతులు వ్యవసాయం చేసేందుకు ముందుకు రాలేని పరిస్థితి ఉండేదన్నారు. సాగునీరు అందక విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులు ఇబ్బంది పడుతున్న సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఉచిత విద్యుత్ ను అమలు చేయడంతో పాటు బోర్ల ద్వారా రైతులు వ్యవసాయం చేసుకునే అవకాశం కల్పించారన్నారు. అవసరమైన కాలువల నిర్మాణం చేపట్టి సీమను సస్యశ్యామలం చేసేందుకు తన వంతు కృషి చేశారని ప్రశంసించారు. రైతులు వ్యవసాయం చేస్తారని భరోసా కల్పించి వ్యవసాయం దండగనే దాని నుంచి పండుగగా మార్చిన ఘనత వైఎస్ఆర్ కే దక్కుతుందన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తిని వర్ధంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకుంటున్నారన్నారు. వైయస్సార్ పేరు మీద ఏర్పాటుచేసిన పార్టీ ద్వారా వైయస్. రాజశేఖర్ రెడ్డి తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి తండ్రి ఆశయ సాధనకు కృషి చేస్తున్నారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అన్ని అంశాల్లో అండగా ఉంటూ తమ వంతుగా పార్టీని తిరుగులేని శక్తిగా రూపొందించేందుకు కృషి చేస్తామని గంగుల బ్రిజేంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ గోపవరం నరసింహారెడ్డి, కొంకర కృష్ణారెడ్డి, సింగం వెంకటేశ్వర్ రెడ్డి, డాక్టర్ శీలం సురేంద్రనాథరెడ్డి, గంగుల రామిరెడ్డి, దామోదర్ రెడ్డి, యాదవాడ నరసింహారెడ్డి, ఆళ్లగడ్డ తాలూకా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ పలసాని మల్లికార్జున రెడ్డి మాదం చెన్నయ్య మాదం కిషోర్ , మాజీ కో ఆప్షన్ నెంబర్ రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# బిసి హాస్టళ్లలో నాణ్యమైన విద్య

## మంత్రి సవిత వెల్లడి

బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఏపీ మంత్రి సవిత వ్యాఖ్యానించారు. ఆయా హాస్టళ్లు, గురుకులాలు, వాటి పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. విజయవాడలోని గుణదల బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో శానిటరీ కిట్లను మంత్రి సవిత బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లిఖార్జున, ఇతర బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి మంత్రి సవిత మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థినుల వినతి మేరకు గుణదల హాస్టల్‌లో గ్రంథాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడారు. బీసీ హాస్టళ్లలో 1,200 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించామని మంత్రి సవిత వెల్లడించారు. ఏపీవ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లకు రూ.6 కోట్ల విలువైన శానిటరీ కిట్లు అందజేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఒక్కో కిట్‌లో 11 రకాల వస్తువులు ఉంటాయని వివరించారు. ఇప్పటికే బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో దోమ తెరలు ఏర్పాటు చేశామని అన్నారు. ఆర్వో ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. బీసీ విద్యార్థుల రక్షణకు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. మెనూ సక్రమంగా అమలు చేసేలా 142 మంది కుక్‌లు, కమాటీలను నియమించామని తెలిపారు. ఇంటిని మైమరిపించేలా హాస్టళ్లు, గురుకులాల్లో వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. వచ్చే పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో ఈ ఏడాది కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని అన్నారు. బీసీ బిడ్డలకు నాణ్యమైన విద్యా, వసతి అందిస్తున్నామని మంత్రి సవిత పేర్కొన్నారు.

# గోదారమ్మకు సాష్టాంగ ప్రణామం..

ఈ సందర్భంగా సాంప్రదాయ కోలాటంతో కళాకారులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. రూ.4,192 కోట్ల వ్యయంతో నిర్మించిన పోలవరం ఎడమ కాలువ ద్వారా విడుదల చేసిన ఈ నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 23.44 టీఎంసీల గోదావరి జలాలతో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పారిశ్రామిక, తాగు, సాగునీటి అవసరాలు తీరనున్నాయి. ఈ నీటితో అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేందుకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనివల్ల పుష్కర, ఏలేరు, పంపా, తాండవ, వరహా, మామిడిగెడ్డ ఆయకట్టు కింద ఉన్న మొత్తం 46,620 ఎకరాలు స్థిరీకరణ కానున్నాయి. గోదావరి జలాలు తమ ప్రాంతానికి రావడంతో స్థానిక ప్రజలు, రైతులు ఆనందోత్సాహాలతో పులకించిపోయారు. కాలువకు ఇరువైపులా నిల్చుని ప్రవాహానికి అడుగడుగునా పుష్పాంజలి ఘటిస్తూ, హారతులు పడుతూ గోదారమ్మకు స్వాగతం పలికారు. తమ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతు సోదరులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి అక్కడున్న ప్రజాప్రతినిధులు, అధికారులందరినీ స్వయంగా పిలిచి శిలాఫలకం వద్ద గ్రూప్ ఫోటోలు దిగారు.

# నరసరావుపేట జేఎన్టీయూలో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్

కల్పించిన వసతులను పరిశీలించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు యూనివర్సిటీ యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

# స్థానిక ఎన్నికల్లో ఉనికి కోసం ఆరాటం

చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి కోసం గొడ్డలి పార్టీ ఆరాట పడుతోందని విమర్శించారు. వైసీపీ ఏ రోజు ప్రజల సమస్యలపై ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. బుధవారం కర్నూలు జిల్లాల్లో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు ముందస్తు ఆలోచనతో ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తున్నారని పేర్కొన్నారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ప్రజా సంక్షేమం కోసం ఏమి చేశారో చెప్పే దమ్ము ఉందా అని బీసీ జనార్దన్ రెడ్డి నిలదీశారు. సీఎం చంద్రబాబు దూరదృష్టి తో పట్టిసీమను పూర్తి చేసి ఆదుకున్నారని తెలిపారు. పులివెందులకు కూడా నీరు ఇచ్చిన ఘనత చంద్రబాబుదని చెప్పుకొచ్చారు. 36 నీటి ప్రాధాన్య ప్రాజెక్టులకు నీరు ఇస్తున్నామని వెల్లడించారు. ఏపీలో డ్రిప్ ఇరిగేషన్ లేకుండా చేసింది జగన్ మోహన్ రెడ్డినే అని విమర్శించారు. వైసీపీ నేతలు దొంగ దీక్షలు, ధర్నాలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి అన్నారు. ప్రజలకు, రైతులకు ఏ విధంగా నీరు ఇవ్వాలో అధికారులతో తాము సమీక్షలు చేస్తున్నామని తెలిపారు. తలకిందులు చేసిన కూడా గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. కేసీ కెనాల్‌కు నీరు ఎప్పుడు విడుదల చేస్తామో త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు. వైసీపీ లాగా సెట్టింగ్‌లు వేసి తాము డ్రామాలు చేయమని బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు.

# గొల్లగుప్పలో మలేరియాతో బాలిక మృతి

గ్రామస్తులకు పంపిణీ చేసిన మలేరియా మందులను ల్యాబ్‌కు పంపాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్‌కు ఆయన ఫోన్ చేసి.. బాలిక (7) మృతి ఘటనపై ఆరా తీశారు. అలాగే ఈ ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెండో తరగతి చదువుతున్న బాలిక మృతిపై ఆయన విచారం వ్యక్తం చేశారు. బాలిక కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామంలో ప్రత్యేక వైద్య బృందంతో పర్యవేక్షణ కొనసాగుతోందని డిప్యూటీ సీఎంకు జిల్లా కలెక్టర్ వివరించారు. మలేరియా నివారణ కోసం మాత్రలు తీసుకున్న 53 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనలో పలువురు అనారోగ్యం బారిన పడ్డారు. దీంతో తెలంగాణలోని భద్రాచలంతోపాటు లక్ష్మీపురంలో వారంతా చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అలాగే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని అదేశించిన సంగతి తెలిసిందే. గొల్లగుప్పలో 74 మందికి మలేరియా నివారణ కోసం క్లోరోక్విన్ ట్యా÷-లబెట్లు పంపిణీ చేశారు. వీటి వల్ల పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఈ ట్యా÷-లబెట్ వికటించి.. విద్యార్థి జమున (7) మృతి చెందిన సంగతి తెలిసిందే.

# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ నేడు. ఆయనకు ఆయనకు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు ఈ శుభాకాంక్షలు తెలియజేశారు. ‘మిత్రులు, జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. పవర్ స్టార్‌గా అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా ఉండే శ్రీ పవన్ కల్యాణ్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను’. ‘పంచాయతీ రాజ్ శాఖలో అనేక సంస్కరణలతో, అభివృద్ధి కార్యక్రమాలతో పెనుమార్పులు తెస్తున్నారు. గిరిజన ప్రజల కష్టాలు తీర్చేలా రోడ్ల నిర్మాణం నుంచి పచ్చదనం పెంపు వరకు ఆయన తీసుకుంటున్న చర్యలు ఉత్తమ ఫలితాలను ఇస్తున్నాయి. మార్పును ఆవిష్కరిస్తున్నాయి. రాష్ట్ర పునర్నిర్మాణం విషయంలో ప్రజలకు కూటమి ఇచ్చిన మాటను నిజం చేసేలా అనునిత్యం పనిచేస్తున్న పవన్ కల్యాణ్ గారు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకునేలా ఆశీర్వదించాలని ఆ దేవదేవుడిని ప్రార్థిస్తున్నాను’ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**దేవుడిచ్చిన అన్నయ్య: మంత్రి లోకేశ్** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ‘డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. సినీ అభిమానులకు పవర్ స్టార్, జనసైనికులకు సేనాని, నాకు దేవుడిచ్చిన అన్నయ్య పవనన్న ఆయురారోగ్య ఆనందాలతో వందేళ్లు వర్ధిల్లాలి. తెలుగు రాష్ట్రాల్లో పండగను తలపించేలా పవనన్న జన్మదిన వేడుకలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అభిమానులకు అభినందనలు’ అని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

**ప్రజలకు స్ఫూర్తి నిచ్చే నాయకుడు: అచ్చెన్నాయుడు** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు బర్త్ డే విషెస్ తెలిపారు. ‘జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం, ప్రజలకు స్ఫూర్తి నిచ్చే నాయకుడు శ్రీ పవన్ కళ్యాణ్ గారి పుట్టినరోజు సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు. సినిమా రంగంలో తన ప్రతిభతో కోట్లాది మంది అభిమానులను అలరించిన పవన్ కళ్యాణ్ గారు, రాజకీయ రంగంలోనూ సాధారణ ప్రజల సమస్యలపై గొంతెత్తి మాట్లాడే ధైర్యవంతుడైన నాయకుడిగా నిలిచారు’. ‘ప్రజల కోసం తపన పడే పవన్ కళ్యాణ్ గారు, సమాజంలో మార్పు తీసుకురావాలనే ఆకాంక్షతో ఎల్లప్పుడూ ముందుంటారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలిగించాలని, ఆయన ఆశయాలు నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను’. అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.



# సుంకేసులలో వైఎస్సార్ వర్ధంతి



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 02** ఖాజీపేట, సెప్టెంబర్ 2:కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా సుంకేసుల గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దుగ్గిరెడ్డి మురళి మోహన్ రెడ్డి, కీసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ డీఎల్ శ్రీనివాసులరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ డీబీ కొండారెడ్డి, దువ్వూరు మండల అధ్యక్షుడు ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు చంద్ర ఓబులరెడ్డి, యూత్ విభాగం అధ్యక్షుడు ముత్తుకూరు రమణ, మాజీ సర్పంచులు చమళ్లపల్లె బుజ్జి, గురివిరెడ్డి, సుంకేసుల మాజీ డీలర్ పెద్ది సుబ్బారెడ్డి, మాజీ వార్డు సభ్యుడు గంగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన జననేత వై ఎస్ ఆర్..



**నంది ప్రతినిధి, సెప్టెంబర్ 2, కడప జిల్లా** మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి పురస్కరించుకొని కడప నగరంలోని పెద్ద పోస్ట్ ఆఫీస్ వద్ద ఘనంగా నివాళులర్పించడం జరిగింది. మాజీ డిప్యూటీ మేయర్ నిత్యా నంద రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన చేసిన సంక్షేమ, అభివృద్ధి సంస్కరణలను స్మరించుకున్నాము. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కడప జిల్లా త్రిమూర్తులు ప్రముఖ నాయకులు, నాయకు రాళ్లు, మరియు కార్యకర్తలు పి రవీంద్రనాథ్ రెడ్డి కడప జిల్లా అధ్యక్షులు, కే సురేష్ బాబు రాష్ట్ర సీఈసీ మెంబర్, ఎస్. బిఆంజర్ భాష రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం, మాజీ టిడిపి బోర్డ్ మెంబర్ మాసిమా బాబు, తెలుగు పులి వెంకటసుబ్బమ్మ కడప జిల్లా మహిళా అధ్యక్షురాలు, పాక సురేష్ మాజీ మేయర్, పులి సునీల్ కుమార్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్సీ సెల్, వినోద్ రాష్ట్ర పబ్లిక్ సిటీ వింగ్ జోనల్ ఇంచార్జ్, షఫీ రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు, త్యాగి మాజీ కార్పొరేటర్, మరియు పలువురు మాజీ కార్పొరేటర్లు ప్రియతమ నాయకులు, నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు




# వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా కోడుమూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఘన నివాళులు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా కోడుమూరు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. కుడా మాజీ చైర్మన్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. కోడుమూరు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘునాథరెడ్డి, రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, మండల కన్వీనర్ రమేష్ నాయుడు, నాయకులు తదితరులతో కలిసి కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాల్లో భాగంగా పేదలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయించారు. వైద్య చికిత్స కోసం వాహన సౌకర్యం ఏర్పాటు చేసి, చికిత్స అనంతరం వారిని సురక్షితంగా స్వగ్రామాలకు చేర్చారు. "వైఎస్సార్ చూపిన సేవా మార్గంలోడ ప్రజలకు అండగా నిలవడమే మా లక్ష్యం." మహానేత వైఎస్సార్ అమర్ రహే! ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, రవి కుమార్ రెడ్డి, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు సోమశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి, ప్రసాదు, తేనేశ్వర రెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగన్న, మాజీ ఉపసర్పంచ్ మాదలు, ఎంపీటీసీలు రాఘవేంద్ర, శ్రీనివాసులు, మాజీ వార్డ్ మెంబర్లు, విష్ణు దాస్, హనుమంతు, షఫీ, లింగమయ్య, జిల్లా బూత్ కమిటీ సభ్యులు రమేష్, కోడుమూరు నియోజవర్గం ఆర్టివై విభాగం అధ్యక్షులు జగదీష్, మండల సోషల్ మీడియా అధ్యక్షులు మద్దిలేటి, కార్యకర్తలు, వెంకట్ , రాముడు జమ్మయ్య, రవి, తిక్క స్వామి, షేక్షావలి లోకేష్, హర్ష ,ఎర్రమల, రాముడు సురేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి 15 వర్ధంతి పురస్కరించుకొని...



**నంది ప్రతినిధి, సెప్టెంబర్ 2 కడప జిల్లా** కడప నగరంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించడం జరిగింది. పాల్గొన్న కడప జిల్లా నాయకులు మరియు కార్యకర్తలు. కడప జిల్లా అధ్యక్షులు పి రవీంద్రనాథ్ రెడ్డి, కే సురేష్ బాబు రాష్ట్ర సీఈసీ మెంబర్, ఎస్. బి. అంజద్ భాష, రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం, తెలుగు పులి వెంకటసుబ్బమ్మ కడప జిల్లా మహిళా అధ్యక్షురాలు, మాజీ టిడిపి బోర్డు మెంబర్ మాసిమాబాబు, మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, మాజీ మేయర్ పాక సురేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్సీ సెల్, మరియు పలువురు మాజీ కార్పొరేటర్లు, ప్రియతమ నాయకులు, కార్యకర్తలు, నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందుల పార్టీ కార్యాలయంలో....



**నంది ప్రతినిధి, సెప్టెంబర్ 2 వైఎస్ఆర్ కడప జిల్లా** కడప జిల్లా మహిళా అధ్యక్షురాలు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ కడప జిల్లాకు విచ్చేసిన ప్రియతమ నాయకుడు జగనన్నను సాదరంగా ఆహ్వానిస్తూ ఘనంగా శాలువాతో సత్కరించారు. అన్నా చెల్లెలు అనుబంధం వైయస్ జగన్ రాఖీ కట్టి తమ బంధాన్ని మరింత చాటుకున్నారు. మహిళా శక్తి పరిచయం కడప జిల్లాలో పార్టీ పట్టిస్తున్న కోసం నిరంతరం శ్రమిస్తున్న మహిళా నాయకురాళ్లను, జిల్లా కమిటీ సభ్యులను జగన్ అన్నకు పరిచయం చేసి భవిష్యత్ కార్యాచరణ పై చర్చించారు. జగనన్న వెంటే మా పయనం మహిళాలోకం ఎప్పుడూ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ వెంటే

# బేతంచెర్ల లో ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి17వ వర్ధంతి.



**బేతంచెర్ల సెప్టెంబర్ 2 ( నంది పత్రిక )** దివంగత ప్రజానేత, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జళ యజ్ఞ ప్రదాత, పేద, రైతు బాంధవుడు, డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా బేతంచెర్ల పట్టణంలోని శేషారెడ్డి హై స్కూల్ దగ్గర గల,వై.ఎస్.ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాబుధవారం నాడు వైసిపి అగ్ర నాయకులు మాట్లాడుతూ మహా నేత వైఎస్ఆర్.ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో దోహద పడ్డాయని వారు తెలిపారు.అటువంటి గొప్ప నేతకు జన్మించిన మనప్రియతమ ప్రజా నాయకుడు,ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి, తమ తండ్రి బాటలోనే ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్నాడు అని తెలిపారు. అలాగే పట్టణంలోని శేషారెడ్డి సామాజిక ఆరోగ్య కేంద్రం(ప్రభుత్వ ఆసుపత్రి) లో రోగులకు, బాలింతలకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు.ఈ వర్ధంతి కార్యక్రమంలో బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు బుగ్గన నాగ భూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్.చలం రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ ముర్తుజావలి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఖాజా హుస్సేన్, శ్రీ మద్దిలేటి స్వామి మాజీ చైర్మన్స్ సిహెచ్.లక్ష్మిరెడ్డి,బి.సీతా రామ చంద్రుడు,నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ, బేతంచెర్ల మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర్ రెడ్డి,బేతంచెర్ల టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసీ లు, మాజీ ప్రజా ప్రతినిధులు, అన్ని అనుబంధ విభాగాల నాయకులు, వైసిపి నాయకులు కార్యకర్తలు, వాలంటీర్లు, వైయస్సార్ కుటుంబ అభిమానులు, అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి కార్యక్రమం లో పాల్గొని జై వైఎస్ఆర్ అంటున్న నినాదాలు మిన్నంటాయి. వర్ధంతి కార్యక్రమం లో పాల్గొని, విజయవంతం చేసిన ప్రతి ఒక్క రికీ వైసిపి మండల నాయకులు కృతజ్ఞత అభివందనములు తెలియ జేశారు.



# రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు, త్రాగునీరు, పరిశ్రమలకు నిరంధించేందుకు నిజమైన భగీరథ ప్రయత్నం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

## స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కే పట్టాభిరామ్


**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరు నారా చంద్రబాబు నాయుడు ఎంతో వెనుకబడిన ప్రాంతాలకు వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నటువంటి నాలుగు జిల్లాల ప్రజలకు తమ కల సహకారం చేశారని రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కే పట్టాభిరాము తెలిపారు. ఈరోజు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం కర్నూల్ నందు కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పార్టీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పి నాగరాజ్ యాదవ్, రాష్ట్ర డైరెక్టర్లు పర్వీన్ తాజ్, డి జేమ్స్ రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షు లు సోమిశెట్టి నవీన్ తో కలిసి పత్రిక, మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేసి తూర్పుగోదావరి కాకినా బిఆర్ అంబేద్కర్ కోనసీమ అనకాపల్లి విశాఖ జిల్లాలకు ప్రయోజనం చేకూర్చేందుకు దోహదపడుతుందని తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నదుల అనుసంధానంతో కృష్ణ గోదావరి నదులను అనుసంధానం చేస్తూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు నీటిని విడుదల చేయడమే ధ్యేయంగా చంద్రబాబు నాయుడు ముందుకు వెళ్తున్నారని ఇందులో భాగంగానే దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా చేయని విధంగా ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి ఒక క్యాలెండర్ను విడుదల చేసి క్యాలెండర్ ప్రకారమే ప్రాజెక్టులను పూర్తిచేసే నీరందిస్తున్న ఘనత చంద్రబాబు నాయుడుకి దక్కిందని, రూ.35,314 కోట్లతో 36 ప్రాజెక్టులను ఈ ఈ ఐదు సంవత్సరాల కాలంలో పూర్తి చేయడమ దేయంగా పెట్టుకున్నారని వివరించారు. వీటిలో 14 ప్రాజెక్టులు వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలోని ఉన్నాయని వాటికోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని తెలియజేశారు.




గొడ్డలి పార్టీ నేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రాజెక్టులను తానే పనులు ప్రారంభించి చేశానని అయితే చంద్రబాబు నాయుడు క్రెడిట్ చోరీకి పాల్పడుతూ బానే చేశానని చెప్పుకుంటున్నారని విమర్శిస్తున్నారని అయితే అసలైన క్రెడిట్ చోరీ చేసింది వైయస్ జగన్మోహన్ రెడ్డి ని అన్నమయ్య ప్రాజెక్టుకు గేట్లకు కనీసము గ్రీస్ కూడా వేయకుండా ఆ ప్రాజెక్టును నాశనం చేసిన క్రెడిట్ వారికే దక్కిందని, ఈ విషయమై ఆనాడు సాక్షాత్తు భారత పార్లమెంటులో కేంద్ర జల వనరుల శాఖ మంత్రిగా ఉన్నటువంటి గజేంద్ర సింగ్ శకావత్ ఈ అంశాన్ని వెల్లడించారంటే ఆ క్రెడిట్ జగన్ దేనని గుర్తు చేశారు. ఆనాటి మరో మంత్రి గోయల్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వల్లనే ఎన్నో రకాల ఇబ్బందులు వచ్చాయన్న విషయాన్ని వెల్లడించారు ఇది కూడా జగన్ క్రెడిట్ ఏ. చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుల కోసం 12,484 కోట్లు ఖర్చు చేస్తే జగన్ తన ఐదు సంవత్సరాల కాలంలో కేవలం 2 వేలకోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేశాడని గుర్తు చేశారు వెలిగొండ ప్రాజెక్టు విషయంలో తనలో మిషన్లు ఇరుక్కుపోగా ఒక్క చుక్క నీటిని కూడా ఇక్కడి నుంచి పంపకపోగా కేవలం గ్రీన్ కార్పొరేట్ పై వెళ్లి వచ్చి తానే చేశానని చెప్పుకుంటున్నాడు, అలాగే తన హయాంలో జీవో నంబర్ 360 ని తీసుకొని వచ్చి సుమారు 102 ప్రాజెక్టుల ను రద్దు చేసిన ఘనుడు జగన్మోహన్ రెడ్డి వాటిని మర్చిపోవడానికి కొత్త కొత్త డ్రామాలాడుతున్నాడని రాయలసీమ ప్రాజెక్టు పేరుతో 1000 కోట్లను తన పార్టీ నాయకుడు రా రామచంద్రారెడ్డి కి కట్టబెట్టలేదా ఈ విషయము దాచి కూటమి ప్రభుత్వమే ఈ ప్రాజెక్టును అడ్డుకుందని తప్పుడు ప్రచారం చేసింది జగన్ కాదా కూటమి ప్రభుత్వం అయామ్ లో అందరినీవా కోసం 584 4 కోట్లను వెచ్చించగా ఫేస్బుక్ కోసం ఒక్క 1000 రూపాయలు ఖర్చు చేస్తుందని తెలిపారు. రాయలసీమకు ఎంతో ఉపయుక్తమైనటువంటి తుంగభద్ర కు గేట్లు కొట్టుకుపోగా కర్ణాటక తెలంగాణ రాష్ట్రాల సహకారంతో క

33 కొత్త గేటులను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు తనలాగా ప్రాజెక్టుల గేట్లు కొట్టుకొని పోయి వేలాదిమంది నిరాశ్రయులయి ప్రాణాలను కోల్పోవడానికి కారణమైన జగన్ తాను రాయలసీమ ముద్దుబిడ్డనని గొప్పలు చెప్పుకుంటున్నాడని అదేనా వారికున్న విశ్వసనీయతనని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జలయజ్ఞంను నిజమైన జలయజ్ఞం గా చేస్తే, వైయస్ రాజశేఖర్ రెడ్డి వైయస్ జగన్మోహన్ రెడ్డి జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చుకున్న విషయం ఈ రాష్ట్ర ప్రజలు మరువలేదని వివరించారు. కుప్పముకు నీరు అందిస్తున్నానని ట్యాంకర్ల ద్వారా కాలువలకు నీరు వేసి ప్రజలను మభ్యపెట్టడం జగన్ నైజం అయితే పులివెందులకు కుప్పంకు మీరిందించిన ఘనత చంద్రబాబు అని వివరించారు గొడ్డలి పార్టీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు ని విమర్శించడం మానుకోవాలని, ఇలాగే విమర్శిస్తే వారికి రాష్ట్రంలో జీరోనే మిగులుతుందని తెలియజేశారు.

# వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 02** ఖాజీపేట, : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి మహానంది వినోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ డి మురళి మోహన్ రెడ్డి రక్తదానం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, మండల యువత అధ్యక్షుడు ఎం. రమణ, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బత్తుల సుబ్బారాయుడు యాదవ్, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ఎం. వెంకట సుబ్బయ్య, వేమా రెడ్డి, జిల్లా కార్యదర్శి డీబీ కొండారెడ్డి, కూనవారిపల్లి సుబ్బారెడ్డి, కూన నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. హర్షవర్ధన్‌రెడ్డి, , డియల్ శ్రీనివాసలు రెడ్డి ఈశ్వర్‌రెడ్డి,డిమురళీమోహన్‌రెడ్డి, వైస్సార్సీపీ మండలకన్వీనర్, మణికంఠ యాదవ్, నరేంద్రరెడ్డి, వంశీధర్‌రెడ్డి, . కుమార్, హుస్సేన్ పీరా, ద్వారకానాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, కరుణాకర్, జె. మహమ్మద్ సమీర్, ఓబుల్‌రెడ్డి, కొండారెడ్డి, జాకోబు, శివ, సుధాకర్ కొండారెడ్డి, వీరబ్రహ్మయ్య తదితరులు రక్తదానం చేశారు. పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారు.

# వైయస్ఆర్ ఆశయాలే వైఎస్సార్‌సీపీకి మార్గదర్శకం

## వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రామభూపాల్ రెడ్డి

**కర్నూల్ సిటీ నంది పత్రిక** మహానేత వైయస్ఆర్ 17వ వర్ధంతి సందర్భంగా ఓర్వకల్లులో ఘన నివాళులు అర్పించారు ఓర్వకల్లు టౌన్‌లో దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్ఆర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ మహానేత వైయస్ఆర్ కేవలం ఒక ముఖ్యమంత్రి మాత్రమే కాదని, పేదల గుండెల్లో నిలిచిపోయిన ప్రజా నాయకుడని అన్నారు. రైతు సంక్షేమం, పేదల అభ్యున్నతి, మహిళల సాధికారత, విద్యార్థుల భవిష్యత్తు, బలహీన వర్గాల సంక్షేమాన్ని తన పాలనకు కేంద్రబిందువుగా చేసుకున్న గొప్ప ప్రజానాయకుడు వైయస్ఆర్ అని కొనియాడారు. రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి చారిత్రాత్మక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి కోట్లాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత మహానేత వైయస్ఆర్ దేనని పేర్కొన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నాయని అన్నారు. రైతులకు సాగునీరు అందించాలనే వైయస్ఆర్ సంకల్పానికి జలయజ్ఞం ప్రతీకగా నిలిచిందని, కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే ఆయన కలను



నెరవేర్చేందుకు సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని కాటసాని గుర్తుచేశారు. వైయస్ఆర్ చూపించిన ప్రజా సంక్షేమ మార్గం, పేదల పట్ల ఆయనకున్న నిబద్ధత, రైతుల పట్ల ఆయనకున్న ప్రేమ నేటి తరానికి కూడా ఆదర్శమని అన్నారు. మహానేత ఆశయాలను కాపాడటం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడటం వైఎస్సార్‌సీపీ ప్రతి కార్యకర్త బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజల హక్కులు, రైతుల ప్రయోజనాలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ఎప్పటికీ రాజీపడదని కాటసాని రామభూపాల్ రెడ్డి స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడటమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని అన్నారు. మహానేత వైయస్ఆర్ భౌతికంగా మన మధ్య లేకపోయినా.. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ సిద్ధాంతాలు, ఆయన చూపిన ప్రజా పాలనా మార్గం, ఆయన అందించిన స్ఫూర్తి ఎప్పటికీ ప్రజల హృదయాల్లో జీవిస్తూనే ఉంటాయని కాటసాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళులు అర్పించారు.

# ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

## భాగ్యోదయ హైస్కూల్ కో - ఆర్డినేటర్ పరమేష్



**బేతంచెర్ల సెప్టెంబర్ 2 ( నంది పత్రిక ).** చఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల సెప్టెంబర్ 15 వరకు ప్రభుత్వం గడువు పెంచినట్లు భాగ్యోదయ హైస్కూల్ కో - ఆర్డినేటర్ కట్టెల పరమేష్ బుధవారం తెలిపారు. ఎలాంటి ఫైన్ లేకుండా, సెప్టెంబర్ 15 వరకు ఓపెన్ స్కూల్ పది , ఇంటర్ ప్రవేశాలకు అవకాశం ఉందని, చదువు మధ్యలో మానివేసిన వారు గృహిణులు డ్రాప్ అవుట్ విద్యార్థులు ఈ కోర్సు పూర్తి చేసుకొని రెగ్యులర్ కోర్సులలో చేరవచ్చని, ప్రభుత్వ ఉద్యోగులు తమ పదోన్నతుల కొరకు ఓపెన్ స్కూల్ లో చేరవచ్చని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల పనివేళల్లో భాగ్యోదయ హైస్కూల్ ఈఎం బేతంచెర్ల లో సంప్రదించ వచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రతి శనివారం, ఆదివారం భాగ్యోదయ హైస్కూల్ (బోయపేట, పుల్లమ్మ కల్లం దగ్గర) లో క్లాసులు ఉంటాయని బుధవారం నాడు తెలియ జేశారు

# రాయలసీమపై చంద్రబాబు వివక్ష కొనసాగుతోంది..

# కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఎప్పుడు...?

## 90 రోజుల్లో బెంచ్ ఏర్పాటు చేస్తామన్న నారా లోకేష్ హామీ ఏమైంది? నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి

**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాయలసీమపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివక్ష కొనసాగిస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కర్నూలు జిల్లా కోర్టు ఎదుట హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గత పది రోజులుగా న్యాయవాదులు చేపడుతున్న దీక్షలకు వైఎస్ఆర్సీపీ తరఫున కాటసాని రాంభూపాల్ రెడ్డి సంఘీభావం తెలిపారు. న్యాయవాదులు చేస్తున్న పోరాటం న్యాయమైనదని, వారి డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కర్నూలుకు రావాల్సిన హైకోర్టును అమరావతికి తరలించి రాయలసీమకు చంద్రబాబు తీరని అన్యాయం చేశారు అని కాటసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రజల ఆకాంక్షలను పక్కనపెట్టి ప్రాంతీయ వివక్షకు పాల్పడుతున్నారని విమర్శించారు ఎన్నికల ముందు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఆ హామీని అమలు చేయకపోవడం రాయలసీమ ప్రజలను మోసం చేయడమేనన్నారు.




కర్నూలులో 90 రోజుల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ ఏమైందో సమాధానం చెప్పాలని కాటసాని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు.

ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కాటసాని డిమాండ్ చేశారు. రాయలసీమ హక్కులు, కర్నూలు ప్రజల న్యాయమైన డిమాండ్ కోసం వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో అవసరమైతే మరింత ఉధృతంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. న్యాయవాదులతో మాట్లాడుతూ "మీరు చేస్తున్న పోరాటంలో మీతో పాటు మేము కూడా కూర్చుంటాం.. మీ న్యాయమైన డిమాండ్ సాధించే వరకు మీకు అండగా ఉంటాం" అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యకులు ఎస్వీ మోహన్ రెడ్డి ,కర్నూలు మాజీ ఎంపీ బుట్టారేణుక ,కర్నూలు నగర మేయర్ బి వై రామయ్య , లీగల్ సెల్ న్యాయవాదులు, వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు సంఘీభావం తెలిపారు.

## డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి

### శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆదేశాల మేరకు...

**నంది పత్రిక ఆత్మకూరు..** దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రివర్యులు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆత్మకూరు పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నంద్యాల టర్నింగ్ వరకు భారీ బైక్ ర్యాలీనిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్ఆర్ స్మృతివనం వద్ద శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా



మాట్లాడుతూ... మహానేత వైఎస్ఆర్ ప్రజాసంక్షేమ పాలన, పేదల పట్ల ఆయన చూపిన అంకితభావం, రైతు సంక్షేమం కోసం చేసిన విశేష సేవలను స్మరించుకున్నారు. మహానేత వైఎస్ఆర్ గారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని,ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ప్రతి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల,పట్టణ అధ్యక్షులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## "మీ భూమి మీ హక్కు" కార్యక్రమంలో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** "మీ భూమి మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం కోడుమూరు మండలం ఎర్రదొడ్డి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొని రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల భూములకు చట్టబద్ధమైన హక్కు, భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతుల భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం జగన్ పాసు పుస్తకంలో తన బొమ్మను ముద్రించి రైతుల ను మోసం చేశారన్నారు. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో కోడుమూరు మండల ప్రభుత్వ అధికారులు, అగ్రికల్చరల్ అధికారులు, కోడుమూరు మండల టీడీపీ కన్వీనర్ రామ కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఎరిగేరి నుంచి ఉరుకుంద క్షేత్రానికి కాలినడక పాద యాత్ర

### భక్తిశ్రద్ధలతో శ్రీ నరసింహ స్వామివారిని దర్శించుకున్న కర్నూలు జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ బుధవారం ఉదయం ఎరిగేరి నుంచి ఉరుకుంద క్షేత్రం వరకు భక్తిశ్రద్ధలతో కాలినడక పాదయాత్ర చేపట్టారు. ఎరిగేరి నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్రలో కృష్ణమ్మ తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక భక్తిభావంతో సాగిన ఈ యాత్రలో స్వామివారి నామస్మరణ చేస్తూ ఉరుకుంద క్షేత్రానికి చేరుకున్నారు. అనంతరం ఉరుకుంద క్షేత్రంలోని శ్రీ నరసింహ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం కావాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆధ్యాత్మికత మనలో ఆత్మవిశ్వాసాన్ని, సేవాభావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం మరింత అంకితభావంతో పనిచేయాలని స్వామివారి ఆశీస్సులు కోరుకున్నట్లు తెలిపారు. ఈ కాలినడక యాత్రలో టీడీపీ నాయకులు ఎల్ యల్ సి చైర్మన్ టిప్పు సుల్తాన్,బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు,కౌతాళం మండల అధ్యక్షులు సురేష్ నాయుడు, కురువ వీరేష్, వడ్డేమాన్ గోపాల్, రామలింగ, మురళి, బెస్త ఓంకార్, బజారప్ప, దేవేంద్ర, మహాదేవ, బాబురావు, హనుమంతు, నర్సప్ప, గనేకల్ బంగారు బాబు,అంజి, మంత్రికి ముని, చిన్న చిట్టి, పెద్ద చిట్టి, ఉపేంద్ర, వెంకటేష్,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు 'స్టాప్ - వాష్ అండ్ గో' కార్యక్రమం.

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు కర్నూలు పోలీసులు వాహనాల డ్రైవర్లకు "స్టాప్ - వాష్ అండ్ గో" కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవర్ల లైసెన్సుల వంటి భద్రతా ప్రమాణాలను



పరిశీలిస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఆదోని, పత్తికోండ, ఎమ్మిగనూరు, కర్నూలు సబ్ డివిజన్ లలోని నేషనల్ హైవేల లో లారీలు, ప్రవేట్ ట్రావెలింగ్ బస్సులు, ఆర్టీసి బస్సులు , కార్లు, మినీ వ్యాన్లు, లగేజీ బొలేరో వాహనాలను పోలీసులు ఆపి ఆ డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపిస్తున్నారు. వాహనాలను అతి వేగంతో నడపకూడదని, రాంగ్ రూట్ లో వెళ్ళకూడదని, పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోకూడదనిన పోలీసు అధికారులు ఆయా వాహనాల డ్రైవర్లకు తెలియజేస్తున్నారు.

## సమతుల్య పోషక యాజమాన్యాన్ని పాటించాలి

### - మండల వ్యవసాయాధికారి అమిరున్నీసా బేగం

**కొత్తపల్లి - నంది పత్రిక :** నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమతుల్య పోషక యాజమాన్యాన్ని రైతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి అమిరున్నీసా బేగం సూచించారు. బుధవారం మండల పరిధిలోని గోకవరం గ్రామ రైతు సేవకేంద్రం నందు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమ తుల్య పోషక యాజమాన్యం ద్వారా పంటలకు కావాలసిన అన్ని రకాల పోషకాలను సరైన నిష్పత్తిలో, సరైన సమయంలో, సరైన పద్ధతిలో జరుగుతుందన్నారు. దీని వల్ల నేల సారం దెబ్బతినకుండా స్థిరమైన, అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. అదేవిదంగా జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్లో భాగంగా రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు. పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. వీబీఎన్- 10, మినుము రక రకం రైతులకి సబ్సిడీ లో అందుబాటులో ఉందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ సిబ్బంది నరసింహ, గ్రామ రైతులు పాల్గొన్నారు.



## విగ్రహాల ఆర్గనైజర్లతో సమావేశం



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 2:** గ్రామాలలో వినాయక విగ్రహాల సైజులను తగ్గించాలని తాసిల్దార్ పద్మావతమ్మ ఎస్సై జగన్మోహన్ సూచించారు. బండి ఆత్మకూరు తాసిల్దార్ కార్యాలయంలో బుధవారం వినాయక విగ్రహాల ఆర్గనైజర్లతో ఒక సమావేశాన్ని నిర్వహించారు. విగ్రహాలు మట్టితో తయారు చేసినవి ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ప్రస్తుతం నీటి ఎద్దడి ఉన్న కారణంగా నిమజ్జన కార్యక్రమానికి ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. పోలీసులు సూచించిన విధంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. గ్రామాలలో అధికంగా విగ్రహాలు నెలకొల్పకుండా, మితంగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. నిమజ్జన కార్యక్రమానికి డి జేలకు ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని అన్నారు. నిమజ్జన కార్యక్రమం నిర్వహించే రోజు చర్చిలు మసీదుల వద్ద డప్పులు వహించరాదని అన్నారు. సూచించిన నిబంధనల మేరకు శాంతియుతంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించుకొని పోలీసులకు సహకరించాలని తాసిల్దార్ పద్మావతమ్మ ఎస్ఐ జగన్ మోహన్ ఆర్గనైజర్లకు సూచించారు.

# స్వచ్ఛ నగరంగా కర్నూలును తీర్చిదిద్దుతాం





## మంత్రి టీ.జీ. భరత్, యస్ఏపిసి చైర్మన్ పట్టాభిరామ్, కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, ఐఏఎస్

## 30 ఎలక్ట్రిక్ ఆటోలను జెండా ఊపి ప్రారంభించిన మంత్రి

**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేయడంతో పాటు, ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించడం, తడిపొడి చెత్తను మూలంలోనే వేరు చేయించడం వంటి చర్యల ద్వారా కర్నూలును స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, జిల్లా కలెక్టర్ & నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ.సిరి, ఐఏఎస్ అన్నారు. బుధవారం కొండారెడ్డి బురుజు వద్ద రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు నగరపాలక సంస్థకు మంజూరు చేసిన 30 ఎలక్ట్రిక్ ఆటోలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, ఐఏఎస్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి టీ.జీ. భరత్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో చెత్తపై పన్ను విధించడంతో పాటు, చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి చెత్తపై పన్నును రద్దు చేశామని తెలిపారు. ఇంధనంతో నడిచే వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్ ఆటోల ద్వారా పర్యావరణహితంగా చెత్త సేకరణకు శ్రీకారం చుట్టామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు నగరపాలక సంస్థకు 91 ఎలక్ట్రిక్ ఆటోలను మంజూరు చేసిందని, అందులో తొలి విడతగా 30 ఎలక్ట్రిక్ ఆటోలు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మిగిలిన ఆటోలు కూడా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని, కమిషనర్ చల్లా ఓబులేసు నేతృత్వంలోని యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని అభినందించారు. గత ప్రభుత్వం వదిలివెళ్లిన ఘన వ్యర్థాలను సైతం బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా శాస్త్రీయ పద్ధతిలో తొలగించే చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. కొండారెడ్డి బురుజు నుంచి వై.జంక్షన్ వరకు బీటీ రహదారి నిర్మాణం చేపట్టామని, నగరంలో దాదాపు రూ.140 కోట్లతో రహదారులు, డ్రైనేజీ కాలువలు, పార్కుల అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ.. మంత్రి టీ.జీ. భరత్ చొరవతో కర్నూలు నగరంలో పారిశుధ్య నిర్వహణలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నామని తెలిపారు. నగరంలోని చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణం జరుగుతుండగా, కర్నూలులో వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు మంత్రి టీ.జీ. భరత్ చొరవ ఎంతో ఉందన్నారు. కర్నూలులో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌తో పాటు వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం వదిలివెళ్లిన సుమారు 5 లక్షల టన్నుల ఘన వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా రీమిడియేషన్ చేస్తున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛ కర్నూలు కలను సాకారం చేయడానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ తరఫున నగరపాలక సంస్థకు అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. తక్కువ సమయంలోనే నగరపాలక సంస్థ అధికారులు అనేక అభివృద్ధి, పారిశుధ్య ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని అభినందించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సమగ్ర చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, తడిపొడి చెత్తను మూలంలోనే వేరు చేసే విధానాన్ని ప్రజల్లో మరింత విస్తృతంగా అవగాహన కల్పిస్తూ అమలు చేస్తున్నామని చెప్పారు. ఎలక్ట్రిక్ ఆటోల అందుబాటుతో చెత్త సేకరణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, పారిశుధ్య కార్మికులకు కూడా ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. నగర ప్రజలు కూడా తమ బాధ్యతగా చెత్తను తడిపొడిగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ కర్నూలు లక్ష్యాన్ని సాధించగలమని, ఇందుకోసం నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిరంతరం పనిచేస్తున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.పర్వీన్ బాబు, ఎస్ఈ రమణమూర్తి, ఎంహెచ్ఓ డాక్టర్ ఎం.రఘు, నగరపాలక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహానేత వైయస్ఆర్‌ది సుపరిపాలనకు చిరునామా

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మహానేత సేవలు చిరస్మరణీయం

## వైఎస్ఆర్సిపి కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్ వి మోహన్ రెడ్డి

**కర్నూలు సిటీ నంది పత్రిక** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా కర్నూలు జిల్లా కేంద్రంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా వైయస్ రాజశేఖర్ రెడ్డి అందించిన సుపరిపాలన, ప్రజా సంక్షేమ పాలన రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఉచిత విద్యుత్ అందించడంతో పాటు సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి రైతుల పొలాలకు నీరు అందించేందుకు కృషి చేసిన మహానేతగా వైయస్ఆర్ నిలిచిపోయారని అన్నారు.



పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ, అత్యవసర వైద్య సేవలకు 108, విద్యార్థుల ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల జీవితాల్లో వైయస్ఆర్ చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసిన వైయస్ఆర్ పాలన ప్రజా పరిపాలనకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. మహానేత భౌతికంగా దూరమైనా ఆయన చేసిన సేవలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రజల పట్ల ఆయన చూపిన అభిమానం ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ శ్రీమతి బుట్టా రేణుక, బి.వై. రామయ్య, మణి గాంధీ, రామచంద్రారెడ్డి, సత్యనారాయణమ్మ పాల్గొన్నారు. అలాగే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నాయకురాళ్లు, కార్యకర్తలు, వైయస్ఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి కి ఘన నివాళులు అర్పించారు.

# ఘన వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులు వేగవంతం

## వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ పనులు వేగవంతం చేయాలి

## రూ.330 కోట్లతో 15 ఎకరాల్లో ప్లాంట్ నిర్మాణం

## రోజుకు 200 మెట్రిక్ టన్నుల వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్

## రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మరెడ్డి పట్టాభిరామ్

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపడుతున్న ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మరెడ్డి పట్టాభిరామ్ అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. బుధవారం నగర శివార్లలోని గార్గేయపురం డంప్‌యార్డును కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి పరిశీలించి, అక్కడ నిర్మిస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పనుల పురోగతిని కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి పట్టాభి సమీక్షించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ.. కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా దశాబ్దాలుగా గార్గేయపురం, జొహరాపురం డంప్‌యార్డుల్లో సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో పేరుకుపోయిన 10 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ ద్వారా రెమీడియేషన్ చేస్తున్నట్లు తెలిపారు. పాత వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడంతో పాటు భవిష్యత్తులో చెత్త డంపింగ్ సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. చెత్త డంపింగ్‌కు శాశ్వత ముగింపు పలికి, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో గార్గేయపురం డంప్‌యార్డులో 15 ఎకరాల విస్తీర్ణంలో రూ.330 కోట్ల వ్యయంతో ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.అదేవిధంగా ఆధునిక వ్యర్థాల నిర్వహణలో భాగంగా 9.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.8 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రతిరోజూ 200 మెట్రిక్ టన్నుల ఘన వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెసింగ్ చేసి, పునర్వినియోగానికి అనువుగా మార్చే విధంగా ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. కర్నూలు నగరంలో ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు చేపడుతున్న ఈ ప్రాజెక్టులను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని పట్టాభిరామ్ సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగం పెంచాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. డంప్‌యార్డుల్లో పేరుకుపోయిన లెగసీ వ్యర్థాల రెమీడియేషన్‌తో పాటు ఆధునిక వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే కర్నూలు నగరానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. నగరాన్ని స్వచ్ఛమైన, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య సాంకేతిక ఇంజనీరింగ్ ఈఈ గుర్రప్ప యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి కర్నూల్ నంద్యాల జిల్లాల కోఆర్డినేటర్ చింతా సురేష్ బాబు





**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు జనసేన అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ మరియు పాణ్యం నియోజకవర్గ ఇన్చార్జ్ చింతా సురేష్ బాబు ఆధ్వర్యంలో కర్నూల్ నగరంలోని గణేష్ నగర్ నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జనసేన పార్టీ కార్యాలయం బిర్లా కాంపౌండ్ నుండి బైక్ ర్యాలీ ఏర్పాటు చేశారు. అనంతరం నంద్యాల రోడ్డులో గల మెగా సిరి ఫంక్షన్ హాల్ లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి జనసైనికుల సమక్షంలో జరిగే జనసేన పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చింతా సురేష్ బాబు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినం రాష్ట్రవ్యాప్తంగా ఒక పండుగ వాతావరణం లో జరుగుతుందని యువతరం రాజకీయాల్లోకి రావాలనే ఆలోచనతో ఆయన రాజకీయాల్లోకి వచ్చారని యువతకు 25 కేజీల బియ్యం కాదు 25 సంవత్సరాల మంచి భవిష్యత్తుని యువతకు అందించాలనే ఆలోచనతో జనసేన పార్టీ ఏర్పాటు చేశారని బుధవారం పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా యువజన విభాగాన్ని మరియు సంబంధిత లోగోని నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు కార్పొరేషన్ డైరెక్టర్లు తోళ్ళ మంజునాథ్, పీబీవీ సుబ్బయ్య, యాశపోగు బజారి, బోయ సుధాకర్, కటిక మహమ్మద్ షబ్బీర్, జగదీష్, ధరణి మోహన్, రవి, సతీష్, మనోహర్, వీర మహిళలు హసీనా బేగం, సుమలత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ల నమ్మకం సంక్షేమం, అభివృద్ధి' ఇంటింటి ప్రచారం లో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రెండేళ్ల నమ్మకం సంక్షేమం, అభివృద్ధి' ఇంటింటి ప్రచార కార్యక్రమం కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గ పరిధిలో ఎర్రదొడ్డి గ్రామంలో ఉత్సాహభరితంగా సాగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు కూలంకషంగా వివరించారు. ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటూ, 'రెండేళ్ల నమ్మకం సంక్షేమం, అభివృద్ధి' సమాచార కరపత్రాలను ప్రతి ఒక్కరికీ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ:"ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోంది. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. రాబోయే రోజుల్లో కూడా కోడుమూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు మండల టీడీపీ కన్వీనర్ రామకృష్ణా రెడ్డి , స్థానిక టీడీపీ నాయకులు ,తెలుగుదేశం పార్టీ బూత్, యూనిట్ మరియు క్లస్టర్ ఇన్చార్జీలు, జనసేన-భాజపా శ్రేణులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# జన హృదయ నేత డా" వైఎస్ రాజశేఖర రెడ్డి

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బోయ క్రాంతి నాయుడు

**కర్నూల్ సిటీ నంది పత్రిక** జన హృదయ నేత డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి అని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు న్యాయవాది బోయ క్రాంతి నాయుడు అభిప్రాయపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వర్యులు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రులకే ఆదర్శప్రాయుడని కరుడుగట్టిన కాంగ్రెస్ వాది అని దేశం గర్వించదగ్గ నాయకుడని, ఆయన స్వచ్ఛమైన పాలన సాగించారని అలాగే కాంగ్రెస్ అధిష్ఠానం రాజశేఖర రెడ్డి కి పూర్తి స్వేచ్ఛ నిచ్చిందని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దేశంలో ఎక్కడా అమలు చేయని పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని రాజీవ్ ఆరోగ్యశ్రీ, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు పెంపు, రుణమాఫీ, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ గృహకల్ప, అత్యవసర వైద్యం కోసం 108,104 వాహనాలు, రైతులకు ఉచిత విద్యుత్, పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి దేశంలోని ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలిచారని క్రాంతి నాయుడు పార్టీ కార్యాలయంలో జరిగిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17 వ వర్ధంతి కార్యక్రమంలో కార్యకర్తల సమావేశంలో పై విధంగా ఆయన సేవలను కొనియాడారు. ముందుగా పార్టీ కార్యాలయంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక స్టేట్ బ్యాంక్ సర్కిల్ నందలి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంస్య విగ్రహమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర ఇంచార్జి సయ్యద్ ఖాద్రి బాషా ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ యన్ సి బజారన్న, మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, యూత్ కాంగ్రెస్ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఏ ప్రదీప్ రాయల్, జి శ్రీనివాస్ యాదవ్, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు ఈ లాజరస్, ఐఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వలీ భాష, ఐఎన్టియుసి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, కర్నూల్ పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ అలీఖాన్, డిసిసి మాజీ కార్యదర్శులు బి సుబ్రహ్మణ్యం, యు శేషయ్య, ఎస్సీ సెల్ డబ్ల్యూ సత్యరాజు కాంగ్రెస్ నాయకులు మాలిక్ భాష, విజయభాస్కర్, రవి మొదలగువారు పాల్గొన్నారు.



# రాజకీయ ఉనికి కోసమే

## రైతులను అడ్డుపెట్టుకొని తండ్రి కొడుకులు డ్రామాలు



శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 2 :** రైతులను అడ్డం పెట్టుకొని తండ్రి కొడుకులు (మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణి రెడ్డి, రవి కిషోర్ రెడ్డి) డ్రామాలు ఆ డుతున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. కేవలం తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు, తామేదో ఆపద్బాంధవుల్లా రైతులను ఉద్ధరించే విధంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్న పరిస్థితులలో వాస్తవ పరిస్థితులను వివరించేందుకు బుడ్డా రాజశేఖర్ రెడ్డి బుధవారం నంద్యాలలో మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్లినో ప్రభావం కారణంగా నీటి ఎద్దడి తలెత్తిందన్న విషయం ప్రజలందరికీ, రైతులకు,మీడియాకు సైతం తెలుసని బుడ్డా పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఎక్కడ చూసినా బోర్లు బావులు , చెరువులు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని బుడ్డా పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కారణంగా గత నాలుగు నెలల నుండి కూ టమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ విషయంపై దృష్టి సారించి రైతులు వరి పంటలు వేసుకోవద్దు, ఈ కారణంగా అకారణంగా రైతులు నష్టపోవద్దని చెప్పడం జరిగిందని అన్నారు. భగవంతుని దయవల్ల కర్ణాటక మహారాష్ట్ర ప్రాంతాల్లో వర్షాలు బాగా కురియడంతో శ్రీశైలంలో ఆశించిన స్థాయిలో నీళ్లు రావడం జరిగిందని అన్నారు. బండి ఆత్మకూరు లో రెండు రోజుల క్రితం రైతులతో సభ నిర్వహించిన ఈ నాయకులు శ్రీశైలంలో నీళ్లు ఎన్ని ఉన్నాయో చెప్పగలిగారా? అంటూ బుడ్డా ప్రశ్నించారు. తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు రైతులను అడ్డం పెట్టుకొని శిల్పా రవి,చక్రపాణి రెడ్డి నాటకాలు ఆడుతున్నారని బుడ్డా అన్నారు. గతంలో స్వర్గీయ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు హయాంలో పోతిరెడ్డిపాడు ద్వారా రైతులకు నీళ్లు అందిస్తే బీడు భూములుగా ఉన్న పొలాలు సస్యశ్యామలమయ్యాయని అన్నారు. నీటి సౌకర్యం లేక ఎకరా భూమి విలువ 2000 రూపాయల కూడా లేనిపక్షంలో ఎన్టీ రామారావు చలువ వల్ల బీడు భూములు సాగులోకి వచ్చి ఎకరా పొలం విలువ 20 లక్షల రూపాయలకు చేరుకుందని అన్నారు. రైతులు వేసుకున్న పంటలు పాడైపోతే,రైతులు ఆర్థికంగా నష్టపోతే, రియల్ ఎస్టేట్ వ్యాపార బుద్ధితో ఆలోచించే వీళ్లు తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి వ్యాపారాలు అభివృద్ధి చేసుకోవాలనే కుటిల మనస్తత్వం శిల్పా కుటుంబాన్నిదని అన్నారు. గతంలో శిల్పా చక్రపాణి రెడ్డి శాసనసభ్యుడుగా ఉన్న పరిస్థితులలో బండి ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశంలో రైతులు వచ్చి సాగు నీళ్ళు అడిగితే రబీలో పంటలు వేసుకోమని చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. రబీ సీజన్ వచ్చేనాటికి నీళ్లు ఉండే పరిస్థితి ఉండదని, వెలుగోడు రిజర్వాయరులో సరిపడా నీళ్లు ఉండవు అన్న విషయాన్ని గుర్తించలేదన్నారు. పంటలు వేసుకోమని చెప్పి శిల్ప చక్రపాణి రెడ్డి రెండు నెలల పాటు అడ్రస్ లేకుండా పోవడం జరిగిందని అన్నారు. ఇలాంటి పరిస్థితులలో పొలాలకు నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆ పార్టీకి చెందిన నాయకులే తనను కలవడం జరిగిందన్నారు. ఈ దశలో పార్టీలకతీతంగా గ్రామాలలో ముఖ్యమైన రైతులందరికీ తీసుకొని కర్నూలుకు వెళ్లడం జరిగిందని అన్నారు. కర్నూలులో డి ఆర్ సి మీటింగ్ జరుగుతున్న సందర్భంలో ఇరిగేషన్ శాఖ మంత్రి అనిల్ కుమార్ ను కలవాలని వెళితే తమను రానీయకుండా పోలీసులను అడ్డం పెట్టడం జరిగిందని బుడ్డా గుర్తు చేశారు. మంత్రి అనిల్ కుమార్ జిల్లా పరిషత్ లో ఉన్నారని తెలిసి అక్కడికి కూడా రైతులతో వెళితే అక్కడ కూడా మంత్రిని కలవ నీయకుండా అడ్డుకున్నారని అన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ లో వచ్చిన నీటిని ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలి అన్న విషయంలో జిల్లాలో అందరం, కలెక్టర్ తో ఇరిగేషన్ అధికారులతో అధికారులతో కలిసి ఒక ప్రణాళిక బద్ధంగా మేజర్ రిజర్వాయర్లను ఏ విధంగా నింపుకోవాలి, శ్రీశైలంలో పోతిరెడ్డి పాడు దగ్గర లెవెల్స్ పర్మిట్ చేసేంత వరకే వాడుకోవాలి. నీళ్లు పర్మిట్ చేసేంత వరకే వాడుకోవాల్సి ఉంటుంది కానీ తర్వాత వాడుకునే వీలు ఉండదని అన్నారు. వీళ్లు మాట్లాడితే మీ గొప్పల కోసం వెలుగోడు రిజర్వాయర్ కు నీళ్లు తీసుకుపోతున్నారని అంటున్నారు. తెలంగాణ పవర్ హౌస్ ద్వారా నాగార్జునసాగర్ కు నీళ్లు ఇస్తున్నారని,ఈ నాయకులు ఈ విధంగా మాట్లాడితే మీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి నాగార్జునసాగర్ కు ఎందుకు నీళ్లు ఇవ్వడం లేదని మరో విధంగా మాట్లాడుతున్నారని బుడ్డా అన్నారు. గతంలో మీ ప్రభుత్వం ఉన్నప్పుడు తెలంగాణకు నీళ్లు తీసుకుపోలేదా? ఆరోజు మీరంతా గాడిదలు కాస్తున్నారా? అంటూ బుడ్డా విమర్శించారు. కెసిఆర్ జగన్ మోహన్ రెడ్డి మిత్రులు కదా! తెలంగాణకు నీళ్లు తీసుకొని పోతుంటే అప్పుడు మీరు ఎందుకు ఆపలేకపోయారని బుడ్డా అన్నారు. విభజన జరిగినప్పటినుండి కొన్ని సమస్యలు ఉన్నాయి కాబట్టి, ఈ సమస్యల పట్ల అవగాహన లేకుండా రైతులను మోసం చేసేందుకు శిల్పా చక్రపాణి రెడ్డి రవి కిషోర్ రెడ్డి రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. వీళ్ళ మాయ మాటలు నమ్మి రైతులు మోసపోకండి అంటూ బుడ్డా రాజశేఖర్ రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం సారథ్యంలో రైతు సంక్షేమం, అభివృద్ధి కొరకు పనిచేస్తుందన్న విషయాన్ని రైతులు గుర్తించాలని బుడ్డా రాజశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## బండి ఆత్మకూరులో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 2:** బండి ఆత్మకూరు తహసిల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఉద్యోగులు తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల వేతనాలను ప్రస్తుత జీవన వ్యయానికి అనుగుణంగా సవరించేందుకు పే రివిజన్ కమిషనర్ ను నియమించకుండా రెండు సంవత్సరాలుగా జాప్యం చేస్తుందని అన్నారు. ఈ కారణంగా పిఆర్సి కమిషనర్ను నియమించి 12వ పిఆర్సి ప్రకటన ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. పే రివిజన్ ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉద్యోగులపై పెరుగుతున్న ఆర్థిక బహారాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంటీరియమ్ రిలీఫ్ ను మంజూరు చేయాలని అన్నారు. ధరలకు అనుగుణంగా ప్రతి ఆరు మాసాలకు ఓసారి ఉద్యోగులకు రావాల్సిన 5 పెండింగ్ డి ఏ లను ప్రకటించి బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులకు నేషనల్ మరియు ఏఏఎస్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని అన్నారు. కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని అన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, సంక్షేమ పథకాలలో వారిని భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పద్మావతమ్మ రెవిన్యూ సిబ్బంది గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వైద్య రంగంలో మరో మైలురాయి
## మెడిసిన్ సీటు సాధించిన షాహిద్ హుస్సేన్



**వెలుగోడు సెప్టెంబర్ 02 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణానికి చెందిన విద్యార్థి బన్నూరు షేక్ షాహిద్ హుస్సేన్ ప్రతిష్ఠాత్మక మెడిసిన్ సీటు సాధించి, తన కుటుంబానికి మరియు వెలుగోడు పట్టణానికి విశేష కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టాడు. పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్.ఎం.పి డాక్టర్ జాకీర్ హుస్సేన్ కుమారుడైన షాహిద్ హుస్సేన్, తన ప్రాథమిక విద్యను శ్రీ చైతన్య పాఠశాలలో, ఇంటర్మీడియట్‌ను శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో పూర్తి చేశాడు. ఆ తర్వాత శ్రీ చైతన్య గోశాల క్యాంపస్‌లో మెడిసిన్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్నాడు. ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో 475 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో 4113 ర్యాంకును కైవసం చేసుకున్నాడు. తాజాగా నిర్వహించిన మెడికల్ కౌన్సెలింగ్‌లో కుప్పం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్నాడు.

**ఆదర్శవంతమైన కుటుంబం ప్రతిభావంతులైన కుమారులు:** షాహిద్ తండ్రి జాకీర్ హుస్సేన్ ఆర్.ఎం.పి డాక్టర్‌గా పేద, మధ్యతరగతి ప్రజలకు విశేష వైద్య సేవలు అందిస్తూ మంచి గుర్తింపు పొందారు. అంతేకాక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుగుదేశం పార్టీ మండల నాయకుడిగా క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.ఆయన పెద్ద కుమారుడు జాహిద్ హుస్సేన్ రాయ్‌పూర్ ఐఐఎం లో ఎంబీఏ పూర్తి చేసి, పూణేలోని 'ఫార్మాఏస్' కంపెనీలో మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రెండవ కుమారుడు బన్నూరు షేక్ నాజీర్ హుస్సేన్ ఏలూరులోని అల్లూరి సీతారామరాజు మెడికల్ కాలేజీలో హౌస్ సర్జన్‌గా సేవలందిస్తున్నారు. ఇప్పుడు మూడవ కుమారుడు షాహిద్ హుస్సేన్ కూడా మెడిసిన్ సీటు సాధించడంతో ఆ ఇంట్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి.

**అభినందనల వెల్లువ:** షాహిద్ హుస్సేన్ సాధించిన ఈ ఘనత పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, పట్టణ ప్రముఖులు మరియు ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ఉత్తమ వైద్యుడిగా సమాజానికి మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు.

## దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్‌కి ఘన నివాళి... వైసీపీ





**మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి గృహంలో 17వ వర్ధంతి, ఘన నివాళులు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలించిన వైఎస్సార్ ఆదర్శప్రాయుడు: వైఎస్సార్‌సీపీ నేతలు**

**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 2 ( నంది పత్రిక )** ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గృహంలో రాష్ట్ర సీఈసీ సభ్యులు పీపీ నాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వైఎస్సార్‌కు నివాళులు అర్పించారు. అలాగే నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటర్ సాయిబాబా నగర్, చామకాల్వ సెంటర్లలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల అసెంబ్లీ అబ్జర్వర్ సద్దల సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర సంయుక్త ప్రచార కార్యదర్శి బుల్లెద్దుల రవికుమార్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు పురుషోత్తం రెడ్డి విజయ శేఖర్ రెడ్డి, మాజీ బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్,వైసీపీ జిల్లా డాక్టర్స్ వింగ్ డా. సుబ్బారెడ్డి, నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, జిల్లా వైసీపీ లీగల్సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య,జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్,జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, , జిల్లా వైసీపీ మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు కారు రవికుమార్, జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, వైసీపీ జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, జిల్లా వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టి.వి రమణ, వైసీపీ రాష్ట్ర ర్ సెల్ జనరల్ సెక్రటరీ శంకర్ నాయక్, వైసిపి రాష్ట్ర జూ సెల్ కార్యదర్శి ఆంజనేయులు, వైసీపీ మండల అధ్యక్షులు బసవేశ్వర రెడ్డి,వైసీపీ జిల్లా సెక్రటరీ దేవానగర్ బాషా,మరియు మాజీ కౌన్సలర్స్, వార్డు ఇంచార్జ్ లు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు... ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు పి.పి. నాగిరెడ్డి మాట్లాడుతూ... డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలు వర్ణనాతీతమని కొనియాడారు.జలయజ్ఞం ద్వారా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాజెక్టులను నిర్మించి వైఎస్సార్ 'జలయజ్ఞ ప్రదాత'గా నిలిచారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్ వంటి విప్లవాత్మక పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు.

నేడు రాష్ట్రంలో సాగునీరు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉంద ని, దీనిపై పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని పి పి నాగిరెడ్డి డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన తండ్రి బాటలోనే నడుస్తూ రాష్ట్రంలో మెరుగైన సంక్షేమ, అభివృద్ధి పాలన అందించారని పేర్కొన్నారు. మహానేత వైఎస్సార్ ఆశయ సాధనకు, ఆయన చూపిన బాటలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.

## రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 2 :** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న రామాపురం గ్రామంలో బుధవారం తహసిల్దార్ పద్మావతమ్మ మీ భూమి మీ హక్కు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో రి సర్వే జరిగిన అనంతరం 850 మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. పాసుపుస్తకాల విషయములో ఏదైనా అభ్యంతరాలు ఉంటే తాసిల్దార్ కార్యాలయంలో సంప్రదిస్తే వాటిని పరిష్కరించడం జరుగుతుందని తాసిల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వైయస్సార్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన వైస్సార్సీపీ నాయకులు యూపదిన్నె మద్దిలేటి

**కర్నూల్ సిటీ నంది పత్రిక** వైయస్సార్ 17 వ వర్ధంతి సందర్భంగా కోడుమూరు నియోజకవర్గం గూడూరు మండలం జులకల్ గ్రామంలో ఉన్నటువంటి వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వై మద్దిలేటి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్ర తెలుగు ప్రజల గుండెల్లో గుర్తుండే విదంగా ముద్ర వేసిన మహానేత దిగంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మనల్ని భౌతికంగా విడిచిపెట్టి వెళ్లిన ఆయన అందించిన సంక్షేమ పథకాలు ఆరోగ్యశ్రీ, ఉచిత కరెంట్, ఫీజు రియంబర్స్మెంట్ ఇలా ఎన్నో పతకాలు ఆశ్చర్యాన్ని చిరునవ్వు ఇప్పటికీ కోట్లాదిమంది ప్రజల గుండెల్లో సజీవంగానే ఉందని తెలియజేశారు.



# మహానేత వైఎస్ఆర్ కు ఘన నివాళులు..

**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 2 (నంది పత్రిక):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ప్రజల హృదయాలలో కొలువైన మహానేత దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని వైసిపి నాయకులు కొనియాడారు. మహానేత వైయస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన రుద్రవరంలోని అమ్మవారి శాల సెంటర్ లో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గంధం వీర రాఘవ రెడ్డి ఆధ్వర్యంలో, అలాగే ఆలమూరు గ్రామంలో పాణ్యం బ్రదర్స్ ఆధ్వర్యంలో నరసాపురం గ్రామాలతో పాటు పలు గ్రామాలలో వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానుల సమక్షంలో బుధవారం వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్ వైయస్ఆర్ అంటూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించి సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల హృదయాలలో జరగని ముద్ర వేసుకున్న మహానేత అని కొనియాడారు. పేదలు రైతులు బడుగు బలహీన వర్గాల కోసం వైఎస్ఆర్ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేని అని రైతులు పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల వారికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన మహానేత వైయస్సార్ అని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం, గృహ నిర్మాణాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ వంటి ఎన్నో సంక్షేమ పథకాల తోపాటు రైతులకు సాగునీరు అందించిన ఘనత వైఎస్ఆర్ దేనిని గుర్తు చేశారు. ఆ మహానేత అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలను కొనసాగించడమే ప్రతి వైసిపి నాయకుడు కార్యకర్త ఆ మహానేతకు అందించే ఘనమైన నివాళి అని అన్నారు. నివాళులు అర్పించిన వారిలో ఎంపీపీ మబ్బు బాలస్వామి, నరసాపురం మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, దేవగుడి జాకీర్ హుస్సేన్, నెంబర్ వన్ హుసేని, హరి నారాయణ, ఆలమూరు పాణ్యం చంద్ర, పాణ్యం నాగేష్, శూలం రామిరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ జయరాముడు, నరసాపురం కిట్టు, రమణ, మాబు హుస్సేన్, నజీర్ హుస్సేన్, మాజీ జెడ్పిటిసి అన్నలదాసు నరసింహారావు (బాబు) డిష్ భాస్కర్, శ్రీరంగాపురం పామన్న, వైసిపి సోషల్ మీడియా ఖాదర్ భాష తోపాటు ఆయా గ్రామాల నుండి తరలివచ్చిన పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



# రాహుల్ గాంధీ గారు పేద ప్రజల పక్షపాతి

### యువజన కాంగ్రెస్ కర్నూల్ కోఆర్డినేటర్ మనోహర్ ఆచారి

**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాహుల్ గాంధీ పేదల పక్షపాతి అని వారి సమస్యలు ప్రజల వద్దకు వెళ్లి తెలుసుకుంటాడని అవి వెంటనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తాడని యువజన కాంగ్రెస్ కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ మనోహర్ చారి అభిప్రాయపడ్డారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ ప్రదీప్ రాయల్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో మనోహర్ చారి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రివర్యులు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళు లర్పించడం జరిగిందని తెలియజేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ పాలనతో దేశ ప్రజలు విసిగిపోయారని రాహుల్ గాంధీ నాయకత్వం కోరుకుంటున్నారని చాత్రోంకి గూంజ్ రెండవ విడత ద్వారా యువజన కాంగ్రెస్ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మమేకం కావాలని రాహుల్ గాంధీ పిలుపునివ్వడం జరిగిందని విద్యార్థుల అభిప్రాయాలు సేకరించి అధిష్టానానికి పంపుతామని మనోహర్చారి తెలియజేశారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు న్యాయవాది బోయ క్రాంతి నాయుడు మాట్లాడుతూ ప్రియతమ రాహుల్ గాంధీ యువతకు మద్దతుగా నిలుస్తున్నారని ఆయన చేసిన కార్యక్రమాలు చాలా ఉన్నాయని అందులో ఛత్రోంకో గూంజ్ విద్యార్థులపై లాఠీ చార్జిలను దాటి విద్యార్థుల పక్షాన నిలిచి పోరాడడం జరిగిందని సిజెపి ర్యాలీ, ప్రధానమంత్రి ఇంటి వద్ద నిరసన ఇలాంటి కార్యక్రమాలు ఎన్ని అవమానాలు జరిగినా అన్నింటిని లెక్క చేయక విద్యార్థులు ప్రజల పక్షాన నిలిచాడని. నగరాలలో యువతకు ఇబ్బందులు ఉన్నాయని అందులో భాగంగా రాపిడో డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు కార్మికులు కర్షకులు పడుతున్న కష్టాలను చూసి వారికి అండగా నిలుస్తానని రాహుల్ గాంధీ తెలియజేశారని మెహానాత్ కే హాత్ కార్యక్రమాన్ని జిల్లా



స్థాయిలో జయప్రదం చేయాలని క్రాంతి నాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జి శ్రీనివాస్ యాదవ్ యువజన నంద్యాల జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్ ఆలూరు యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అక్బర్ యాదవ్ కర్నూలు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ అలీ ఖాన్ ఆలూరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అక్బర్ యాదవ్ మొదలగు వారు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా, ఆరోగ్యంగా ఎదిగితేనే సమాజ ప్రగతి..!





### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి బాలికల చదువును ఆపి.. బాల్య వివాహాలు చేయొద్దు

### మహిళా సాధికారతకు ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే

**జమ్మలమడుగు, బ్యూరో చీఫ్ సెప్టెంబరు 2: నంది పత్రిక** మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడంతో పాటు ఆరోగ్యం, విద్య, భద్రత, సామాజిక అంశాలపై అవగాహన పెంచుకున్నప్పుడే కుటుంబం, గ్రామం, సమాజం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. బుధవారం జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డీఆర్డీఏ, మెప్మా, ఐసిడిఎస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'మహిళాబాగుసంభాషణ' కార్యక్రమానికి ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణరెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో ముఖాముఖి సంభాషించిన కలెక్టర్.. మహిళా ఆరోగ్యం, పోషకాహారం, బాలికల విద్య, బాల్య వివాహాల నివారణ, స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక అభివృద్ధి, బ్యాంకు రుణాలు, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై విస్తృతంగా మాట్లాడారు. మహిళల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలను అర్హులైన ప్రతి మహిళకు చేరువ చేయడం, వాటిని సక్రమంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించడమే 'మహిళాబాగుసంభాషణ' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.

**పథకాలు అందడంతో పాటు సద్వినియోగం చేసుకోవాలి..**

ప్రభుత్వం, అధికార యంత్రాంగం ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను నిరంతరం అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. అర్హులైన కుటుంబాలకు దాదాపు అన్ని పథకాలు చేరుతున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో పథకం ప్రయోజనాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో కొంత అంతరం ఉంటోందన్నారు. 'మహిళాబాగుసంభాషణ' వంటి కార్యక్రమాల ద్వారా ఆ అంతరాన్ని తొలగించి, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చేయడమే లక్ష్యమన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు పొదుపు, బ్యాంకు రుణాలు, సబ్సిడీ రుణాలు, వివిధ జీవనోపాధి కార్యక్రమాలు అందుతున్నాయని తెలిపారు. జిల్లాలో మహిళా సంఘాలకు సుమారు రూ.2,200 కోట్ల రుణాలు అందించగా, వాటి ద్వారా సుమారు రూ.5 వేల కోట్ల మేర ఆర్థిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వివరించారు. తీసుకున్న రుణాలను తిరిగి పెట్టుబడిగా ఉపయోగించుకుని వ్యాపారాన్ని విస్తరించడం ద్వారా మహిళలు కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. చిన్న మొత్తాల రుణాలకు మాత్రమే పరిమితం కాకుండా కుటుంబ సభ్యుల సహకారంతో పెద్ద వ్యాపారాలు, యంత్రాలు, వాహనాలు తదితరాలను కొనుగోలు చేసి ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసుకునే అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు. మహిళా సంఘాల్లోని కుటుంబ సభ్యులకు రుణాలు అందించేందుకు బ్యాంకర్లు కూడా ముందుకు వస్తున్నారని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**మహిళలు సొంత కాళ్లపై నిలబడాలి...** మహిళలు కేవలం రుణాలు తీసుకుని తిరిగి చెల్లించే స్థాయిలో కాకుండా, ఆ రుణాలను పెట్టుబడిగా మలచుకుని సొంతంగా నిలబడటంతో పాటు మరో ఇద్దరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తోందని, బ్యాంకర్లు, డీఆర్డీఏ, మెప్మా అధికారులు కూడా మహిళలకు అవసరమైన మార్గదర్శకత్వం, సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

**మహిళల ఆరోగ్యంపై కుటుంబాల్లో మార్పు రావాలి.. పిలుపునిచ్చార** మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని కలెక్టర్ సూచించారు. కుటుంబంలో భర్త, పిల్లలు, అత్తమామలు భోజనం చేసిన తర్వాత మహిళలు భోజనం చేసే పరిస్థితి ఇప్పటికీ అనేక ఇళ్లలో ఉందన్నారు. మహిళలు అందరికంటే ముందుగా లేదా కుటుంబ సభ్యులతో సమానంగా కూర్చొని భోజనం చేయాలనిసూచించారు. మహిళలకు అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు వంటి పోషకాలు తగిన మోతాదులో అందకపోవడం వల్ల రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. పేద, మధ్యతరగతి, ఆర్థికంగా బలమైన కుటుంబం అనే తేడా లేకుండా మహిళల ఆహారం, ఆరోగ్యానికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ విషయంలో ప్రతి కుటుంబంలో మార్పు రావాలని, దీనిని ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**బాలికలకు ఉన్నత విద్య అందించాలి...** బాలికలను చిన్న వయసులోనే వివాహం చేయాలనే ఆలోచనను తల్లిదండ్రులు విడనాడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బాలికలు చదువుకునే వయసులో వారికి విద్యను అందించి, ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించాలని కోరారు. బాలికలు విద్యలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్నారని, జిల్లాలో ఇటీవల సాధించిన ఉన్నత ర్యాంకుల్లో అత్యధికంగా బాలికలే నిలిచారని తెలిపారు. తల్లిదండ్రులు బాలికను భారంగా భావించకుండా, ఆమె భవిష్యత్తుకు పెట్టుబడిగా భావించాలని సూచించారు. చదువు మధ్యలోనే ఆపి వివాహం చేయడం ద్వారా వారి భవిష్యత్తును పరిమితం చేయరాదన్నారు.

**జమ్మలమడుగులో భారీ పెట్టుబడులు.. యువతకు ఉపాధి అవకాశాలు..**

జమ్మలమడుగు ప్రాంతం భవిష్యత్తులో పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందనుందని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతంలో భారీ పెట్టుబడులతో పరిశ్రమలు, వివిధ ప్రాజెక్టులు రానున్నాయని చెప్పారు. సిమెంట్ పరిశ్రమల విస్తరణ, కొత్త పరిశ్రమలు, ఇంధన ప్రాజెక్టులు, రాయలసీమకు కీలకమైన థీమ్ పార్కు వంటి అభివృద్ధి కార్యక్రమాల ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. గండికోటను పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో స్థానికంగా హోటళ్లు, రవాణా, ఆహార, హస్తకళలు, ఇతర సేవా రంగాల్లో వ్యాపార అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రానున్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువత, మహిళలు నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు.

**జమ్మలమడుగు ఆసుపత్రిలో అనస్థీషియా వైద్యుని నియమిస్తాం...** జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. త్వరలోనే ఆసుపత్రిలో అనస్థీషియా వైద్యుని నియామకం చేపడతామని వెల్లడించారు. స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన సిబ్బంది, వైద్య సౌకర్యాల బలోపేతానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

**మహిళా సాధికారతకు ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే**

ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం ద్వారా మహిళలకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు అందుతున్న రుణాలు, జీవనోపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతి మహిళ ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుందని, కుటుంబాలు బలపడితే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. బాలికలకు ఉన్నత విద్య అందించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని, మహిళల ఆరోగ్యం, భద్రత, విద్య, ఉపాధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు.

**మహిళా సాధికారతకు డీఆర్డీఏ, మెప్మా నిరంతర సహకారం: పీడీలి** డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. మహిళా సంక్షేమం, సాధికారత, భద్రత, ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, ఆర్థిక స్వావలంబన కోసం డీఆర్డీఏ, మెప్మా ద్వారా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. మహిళల సమస్యలను తెలుసుకుని, అర్హులైన ప్రతి మహిళకు ప్రభుత్వ సేవలు, పథకాలను చేరవేయడం, వాటిని సక్రమంగా వినియోగించుకునేలా అవగాహన **కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.**

ప్రతి మహిళకు ఆరోగ్యం, ప్రతి బాలికకు విద్య, ప్రతి మహిళకు జీవనోపాధి, ప్రతి కుటుంబానికి స్థిరమైన ఆదాయం, ప్రతి మహిళకు భద్రత, తన హక్కులపై అవగాహన కల్పించే దిశగా అన్ని శాఖలు, మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

**మహిళా లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ...**

కార్యక్రమం ముగింపులో జమ్మలమడుగు పరిధిలో డీఆర్డీఏ, మెప్మా ద్వారా శ్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు పొందిన మహిళా లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే సి. ఆదినారాయణరెడ్డి కలిసి మెగా చెక్కును అందజేశారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో 'మన లెక్కలుమన డబ్బులు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ సంబంధిత పోస్టర్‌ను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

కార్యక్రమంలో జమ్మలమడుగు మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, యువ నాయకుడు భూపేష్‌రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో శిరీష, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, ఎల్‌డీఎం జనార్ధన్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, గైనకాలజిస్టు డా. విజయలక్ష్మి, డీఆర్డీఏ, మెప్మా, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖల సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.





# ఘనంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు

### కోడుమూరు జనసేన నాయకులు సంధ్య విక్రమ్ కుమార్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** జనసేన పార్టీ అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు కోడుమూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు సంధ్య విక్రమ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి కోడుమూరు నియోజకవర్గం కోడుమూరు గూడూరు బెళగల్ కర్నూలు మండలాల నుంచి భారీగా నాయకులు కార్యకర్తలు పాల్గొని భారీ కేక్ ను కట్ చేసారు అనంతరం జనసేన యువజన విభాగం లోగో జనసేన పార్టీ పి ఏ సి సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరా శాఖ మంత్రి వర్యులు నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించిన లోగో ను లైవ్ ద్వారా నాయకులు కార్యకర్తలు వీక్షించారు అనంతరం భారీగా రక్తదానం కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు అంతకు ముందు యువతను జనసేన పార్టీలో భాగ్యస్వామం చేస్తూ కోడుమూరు అర్బన్ సంతోష్ నగర్ , మునగల పాడు,మామిదలపాడు ,మాసమసీద్, కొండారెడ్డి నగర్, స్టాంటన్ పురం, బాలాజీ నగర్ వరకు బైక్ ర్యాలీ సాగింది ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో అభిమానులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

# ప్రజల పక్షపాతి వైఎస్సార్



**కొత్తపల్లి – నంది పత్రిక:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల పక్షపాతిగా దివంగతనేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిలిచారాని వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దుద్యాల, నాగంపల్లి, కొక్కెరంచ గ్రామాలలో వైఎస్సార్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ జీవితమంత రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, సంక్షేమం, రైతుల అభివృద్ధి, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికై శ్రమించాడన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా లక్షల మంది కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. రాష్ట్రంలోని రైతుల పంటపొలాలకు సాగునీరు అందించేందుకు ఎన్నో ప్రాజెక్టు నిర్మించి అపర భగీరథుడయ్యాడని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు లోకేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, రమణా రెడ్డి, నంద్యాల ఉస్మాన్, రమేష్ బాబు, మాజీ సర్పంచు మల్లయ్య, రవి, జయన్న, భగవాన్ రెడ్డి, ఉమ్మార్సా, అల్తాఫ్, అజ్మతుల్లా, మాజీ సర్పంచు లింగస్వామి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు మహానేత వైయస్సార్

### వైసిపి పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘన నివాళులు



**జూపాడు బంగ్లా సెప్టెంబర్ 2 (నంది పత్రిక )** జూపాడుబంగ్లా మండల కేంద్రంలోని సంత మార్కెట్ నందు వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వై ఎస్ ఆర్ సి పి మండల కన్వీనర్ తోకల కృష్ణారెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిలో నిలిచిపోయాడని కొనియాడారు. వైఎస్ఆర్సిపి నాయకులు మాట్లాడుతూ వైయస్సార్ ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో ఆరోగ్యశ్రీ తో పేదలకు కార్పొరేట్ వైద్యం, పేద విద్యార్థులకు ఉన్నత విద్య, రైతులకు ఉచిత విద్యుత్ అమలు అమలు చేశారని, జల యజ్ఞంలో భాగంగాలో సాగు, తాగునీరు కోసం ఎన్నో ప్రాజెక్టులు ప్రారంభించి పూర్తి చేసిన ఘనత వైఎస్ఆర్ కే దక్కుతుందని కొనియాడారు. సంక్షేమ, అభివృద్ధి పేద ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొసిక తిరుమలేశ్వర్ రెడ్డి, వైస్ వై వి రమణ, మాజీ సర్పంచ్ నాగార్జున రెడ్డి, తంగడంచ దినేష్, మండల ఎగ్జిక్యూటివ్ నెంబర్ రాఘవేంద్ర, నరసింహులు, మల్లయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు హరికృష్ణ, లక్ష్మన్న, వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# కువైట్‌లో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు..

### శీలం శెట్టి లక్ష్మయ్య ఆధ్వర్యంలో సంబరాలు



**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 2(నంది పత్రిక ):** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు కువైట్‌లోని కైతాన్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పోరుమామిళ్ల మండల జనసేన పార్టీ అధ్యక్షులు శీలం శెట్టి లక్ష్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పాల శివయ్య, సుంకే మోహన్, మల్లికార్జున, నాగేష్, తుమ్మలగుంట తుమ్మలగుంట్ల శివ, చింతల రవి శేఖర్, బైరి శెట్టి గురుప్రసాద్, మూసూరి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# నోటీసుదారులతో మమేకమై వివరాలు తెలిపి విచారణ పూర్తి చేయండి.





### ఈ నెల 10 వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు. నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎం.జయకృష్ణ.

**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 2 నంది పత్రిక** ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ లో నోటీసులు అందుకున్న వారికి వివరాలు తెలిపి త్వరితగతిన విచారణను పూర్తి చేయాలని 167- తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎం.జయకృష్ణ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలోని ఐ.ఎస్. మహల్, చెన్నారెడ్డి కాలనీ, ఎస్.డి. రోడ్డు, రైల్వే కాలనీ, సప్తగిరినగర్ వార్డు సచివాలయాల్లో జరుగుతున్న నోటీసుల విచారణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 10 వరకు పెంచారని తెలిపారు. నోటీసులు అందుకున్న వారికి ఎందుకు ఇస్తున్నామనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రం వరకు రాలేని వృద్ధులు, వికలాంగులు, జబ్బు పడ్డ వారు ఉంటే ఆన్లైన్ ద్వారా విచారణ పూర్తి చేయాలని తెలిపారు. విచారణకు వచ్చిన ఓటర్ల వద్ద సేకరిస్తున్న ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఓటరు సమర్పించిన ఆధారములను, ఓటరు ఇచ్చినటువంటి రసీదును, సదరు ఓటరుకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారంను, హాజరు పట్టికను, బిఎల్ఓ డిక్లరేషన్, విచారణ నివేదికను అన్నీ కూడా సక్రమంగా ఫైలింగ్ చేయాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా విచారణ పూర్తి చేసి ఫైలింగ్ చేయాలని తెలిపారు.

ఫారం 6,7,8 దరఖాస్థులు, అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 10 వ తేదీ వరకు, పరిష్కారానికి అక్టోబర్ 5వరకు గడువు పొడిగించారని తెలిపారు. ఈ తనిఖీల్లో మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, ఎగ్జామినర్ రామచంద్ర రెడ్డి, డి.ఈ.మధు, ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

# గరుడ సేవ, వినాయక నిమజ్జనాలకు పకడ్బందీ ఏర్పాట్లు





### డీజేలు, మద్యం సేవించి డ్రైవింగ్ పై కఠిన చర్యలు
### 24/7 పర్యవేక్షణతో వినాయక సాగర్ వద్ద భద్రతా ఏర్పాట్లు: జిల్లా ఎస్పి ఎల్.సుబ్బారాయుడు
### వినాయక నిమజ్జనం ఏర్పాట్ల పై జిల్లా ఎస్ పి, నగరపాలక సంస్థ కమిషనర్ సమీక్ష
### వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలి
### టీటీడీ పోలీస్, మునిసిపల్ శాఖల సమన్వయంతో వినాయక చవితి ఏర్పాట్లు
### నిమజ్జన శోభాయాత్రల్లో భద్రతకు పెద్దపీట : తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ

**తిరుపతి, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 2: నంది పత్రిక** వినాయక చవితి వేడుకలు, శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఒకే సమయంలో రానున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పండుగను వైభవంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా ఎస్ పి ఎల్. సుబ్బారాయుడు ఆదేశించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాల నిమజ్జన కార్యక్రమ ఏర్పాట్ల పై స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణతో కలసి జిల్లా ఎస్పి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమీషనర్ శారదా దేవి, డిప్యూటీ కమీషనర్ అమరయ్య, ఏఎస్పీ రవి మనోహరాచారి, తుడా సెక్రటరీ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్ రవీంద్ర, టిటిడి ఎస్ ఈ ప్రసాద్, డిప్యూటీ ఈఓ భాస్కర్, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డిసిపీ దేవి కుమారి, డి ఎం అండ్ హెచ్ ఓ నాయక్, అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు, ఫైర్, విద్యుత్, ఫిషరీస్, ఆర్టీసీ, డిఎస్పీ లు, నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్.సి.మునికృష్ణ, మాంగాటి గోపాల్ రెడ్డి, గుండాల గోపి, తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలు, వినాయక చవితి వేడుకలు ఒకే సమయంలో రానున్నందున తిరుపతిలో పండుగలు, నిమజ్జనం మరియు గరుడ సేవ ఉత్సవాలను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, ఉత్సవ కమిటీలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన గరుడ సేవ (సెప్టెంబర్ 18, 19 తేదీలు) దృష్ట్యా తిరుమలకు వెళ్లే భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, వినాయక నిమజ్జనాలను ప్రధానంగా 3వ రోజు లేదా 7వ రోజు తర్వాత పూర్తి చేసుకునేలా నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. వినాయక మండపాల ఏర్పాటు కోసం సింగిల్ విండో పద్ధతి ద్వారా ముందస్తు అనుమతులు పొందాలన్నారు. మండప నిర్వాహకులు రాత్రివేళల్లో రక్షణ, విద్యుత్ దీపాలు, లైటింగ్ మరియు అగ్నిమాపక భద్రత చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా వినాయక సాగర్ వద్ద పటిష్టమైన బారికేడింగ్, 3 నుండి 4 భారీ క్రేన్లు, నిరంతర విద్యుత్/లైటింగ్, 24/7 పర్యవేక్షణ కోసం శిక్షణ పొందిన ఈతగాళ్ళు (స్విమ్మర్లు), మరియు 2 అత్యవసర ఆంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిమజ్జన శోభాయాత్ర సమయంలో డిజేలు ప్రదర్శించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం లేదా అశాంతి సృష్టించడం వంటివి చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు. శోభాయాత్రల నిర్వహణపై సమగ్ర మార్గదర్శకాలు ఇచ్చేందుకు సెప్టెంబర్ 12న ఉత్సవ కమిటీ నిర్వాహకులు, పోలీస్, మునిసిపల్, టిడిడి మరియు విద్యుత్ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కమీషనర్ మాట్లాడుతూ నగరంలో వినాయక చవితి వేడుకలను వైభవంగా, సురక్షితంగా నిర్వహించేందుకు మునిసిపల్ కార్పొరేషన్, పోలీస్, టి టి డి ఇతర శాఖలు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మునిసిపల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనాలకు సంబంధించి సెప్టెంబర్ 14, 16, 20 తేదీలకు అనుగుణంగా రూట్ మ్యాప్ సిద్ధం చేసి, రద్దీకి తగ్గట్టుగా పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన శోభాయాత్రల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చెట్ల కొమ్మలు అడ్డు తొలగించే చర్యలు చేపట్టాలని, టోయింగ్ వాహనాలు అందుబాటులో ఉంచాలని, అశ్లీల నృత్యాలు, నిమజ్జన సమయంలో టపాకాయలు వినియోగాన్ని నిషేధించాలని స్పష్టం చేశారు.

మహిళలు, చిన్నారులకు ప్రత్యేక భద్రత కల్పించాలని ఆదేశించారు. వినాయక సాగర్ వద్ద ఋణ ఆధ్వర్యంలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, విగ్రహాల నిమజ్జనానికి తెప్పలు, అలంకరణలు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు పసుపు, కుంకుమ, కంకణాలు, పుస్తక ప్రసాదం, శ్రీవారి ప్రసాదాల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు సెప్టెంబర్ 11 నాటికి పూర్తి చేయాలని తెలిపారు. వినాయక సాగర్ వద్ద అన్నమాచార్య కళాబృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథలు, కోలాటాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వేడుకల నిబంధనలు, భద్రతా ఏర్పాట్లపై నిర్వాహకులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. నిమజ్జన కమిటీ కన్వీనర్ మాట్లాడుతూ టీటీడీ వారు పుస్తక ప్రసాదాలు, కంకణం వద్ద ఇస్తే అన్ని మండపాల నిర్వాహకులకు ఇస్తామని నిమార్జన కమిటీ వారు తెలిపారు. విద్యార్థుల చేత పార్వతిపుత్ర పర్యావరణం కార్యక్రమం ద్వారా మట్టి విగ్రహాలను తయారు చేయించి పంపిణీ చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

# డంపింగ్ యార్డ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

### కొమ్మారెడ్డి పట్టాభి రామయ్య. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్.

**నందికొట్కూరు సెప్టెంబర్ 2( నంది పత్రిక)** నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డ్ పురోగతి పనులపై స్వచ్ఛభారత్ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామయ్య బుధవారం నందికొట్కూరులో పర్యటించారు. ఆకస్మికంగా తనిఖీ కి విచ్చేసిన చైర్మన్ పట్టాభిరామయ్యకు కమిషనర్ జి వెంకటరామిరెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ పట్టాభి రామయ్య మున్సిపాలిటీ అధికారులు మరియు ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ పనులను మందకోడిగా కాకుండా యుద్ధప్రతిపదికన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డ్ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణంతోపాటు ఫెన్సింగ్ పనులను సకాలంలో పూర్తిచేయాలని, సరిహద్దు గోడల మధ్య ఖాళీ లేకుండా పటిష్టంగా మూసివేయాలని సూచించారు. ప్లాంట్ నిర్వహణకు అవసరమైన విద్యుత్ సదుపాయం 100 కె.వి ట్రాన్స్ఫార్మర్ మరియు పవర్ సప్లై పనులను, హరిత ప్రతిజ్ఞ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చెత్త ప్రాసెసింగ్ నిర్వహణపై సమర్థవంతంగా చేపట్టేందుకు సంబంధిత ఏజెన్సీ లతో సంబంధిత అధికారులతో ప్రత్యేక వర్క్ షాప్ ఏర్పాటుచేసి ప్లాంట్ పనులు సక్రమంగా నిర్వహించకపోతే వేరే ఏజెన్సీలకు అప్పజెప్పాలని ఆయన మున్సిపల్ అధికారులకు సూచించారు. డంపింగ్ యాడింగ్ పరిశీలన వచ్చిన స్వచ్ఛంద చైర్మన్ పట్టాభి రామయ్యకు స్థానికులు సత్యం డంప్ యార్డ్ పనుల ద్వారా ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ప్రజలకు ఇబ్బందిగా డంపింగ్ యార్డ్ నిర్వహణ పనులు చేపట్టినట్లయితే అలాంటి వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, రెవిన్యూ సిబ్బంది మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## జాతీయ కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థ వంతంగా నిర్వహించాలి:

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.



**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 2: నంది పత్రిక** జిల్లాలో జాతీయ కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే ప్రచార కార్యక్రమాన్ని (క్యాంపెయిన్) సమర్థవంతంగా నిర్వహించి, వ్యాధి నియంత్రణ చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత వైద్య, మున్సిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఅర్ఎస్ సమావేశ మందిరంలో సెప్టెంబరు 11 నుండి సెప్టెంబరు 24 వరకు 14 రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమ సన్నద్ధతపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమ సన్నద్ధతపై ప్రచురించిన వాల్ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో ప్రజలకు వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై ఈ 14 రోజుల పాటు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలన దిశగా వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ తమ వంతు బాధ్యతలను బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో కుష్టు కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, భవిష్యత్తు లో జిల్లాను కుష్టు రహితంగా మార్చడమే లక్ష్యంగా అధి కారులు పనిచేయాలని సూచించారు. పురుష, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటిని జల్లెడ పట్టి సర్వే చేయాలన్నారు. ఏ ఒక్క కేసూ విస్మరణకు గురికాకుండా 100% పక్కాగా వివరాలు సేకరించాలన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే వెను వెంటనే తగిన వైద్య చికిత్సలు ప్రారంభించాలన్నారు. వ్యాధి బారిన పడిన వారు అంగవైకల్యానికి గురికాకుండా సకాలంలో వైద్య సేవలు సమర్థవంతంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, కమిటీ కో-చైర్మన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి( డి ఎం అండ్ హెచ్ ఓ) డాక్టర్ . పి యుగంధర్, మెంబర్ సెక్రటరీ జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ రవి బాబు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా పెంచలయ్య, డిసిహెచ్ఎస్ ఇంచార్జి అధికారి రఫీక్ బాషా, వివిధ శాఖల కమిటీ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్2026 ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి

### కడప ఆర్డీఓ, ఎన్నికల నమోదు అధికారి మురళి



**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 2 నంది పత్రిక** ఎస్ఐఆర్2026లో భాగంగా ఓటర్ల జాబితాకు సంబంధించి అందిన దావాలు, అభ్యంతరాలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా పరిష్కరించాలని కడప ఆర్డీఓ, ఎన్నికల నమోదు అధికారి మురళి అధికారులను ఆదేశించారు. బుధవారం కడప ఆర్డీఓ కార్యాలయంలో ఎస్ఐఆర్2026 కార్యక్రమాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దావాలు, అభ్యంతరాల స్వీకరణ, విచారణలు, వాటి పరిష్కారం, నోటీసుల జారీపంపిణీ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే 'బుక్ ఎ కాల్', ఎన్‌జీఎస్‌పీ, ఎస్ఐఆర్2026కు సంబంధించిన కార్యకలాపాల పురోగతిని పరిశీలించారు. దావాలు, అభ్యంతరాలపై నిర్వహించే విచారణలను నిర్ణీత విధానాల ప్రకారం చేపట్టాలని, నోటీసులను సంబంధిత వ్యక్తులకు సకాలంలో అందజేయాలని ఆర్డీఓ సూచించారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన ఎన్నికల సంబంధిత అంశాలను అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకతతో పాటు రాజకీయ పార్టీలకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని ఆర్డీఓ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అన్ని సహాయ ఎన్నికల నమోదు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల హృదయాల్లో చిరస్థాయిగా వైఎస్సార్.. అక్కరెడ్డిపల్లెలో ఘనంగా 17వ వర్ధంతి

**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 2 (నంది పత్రిక ):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని పోరుమామిళ్ల మండలం అక్కరెడ్డిపల్లె గ్రామంలో వైఎస్సార్ అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.మేరెడ్డి రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ చేసిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నాయకులు, అభిమానులు స్మరించుకున్నారు. ముఖ్యంగా పేదలు, రైతులు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాల ద్వారా ఆయన ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ భౌతికంగా దూరమైనా ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రజల కోసం చేసిన సేవలు నేటికీ ప్రజల జ్ఞాపకాల్లో నిలిచిపోయాయని నాయకులు అన్నారు. రైతులు, పేదలు, సామాన్య ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిన వైఎస్సార్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాయపాటి రవికుమార్ ఎంపీటీసీ, బాలకృష్ణ, రవీంద్రారెడ్డి, చిత్తా సుబ్బిరెడ్డి, యోహాను, దస్తగిరి, కిషోర్, రాజా, ఓబయ్య, గురయ్య, థామస్ తదితరులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# తప్పుడు సమాచారంపై మహిళల సమావేశం.

### అవస్తవాలను ఖండించిన వి ఓ ఏ ల యూనియన్. పోలీసులకు ఫిర్యాదు.



**సిరివెళ్ల :(నంది పత్రిక)** మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీలో గల ఎస్సీ కాలనీలో కరుణ మహిళ పొదుపు లక్ష్మి గ్రూపు సభ్యులు లీడర్లు వీవోఏలు వెలుగు సిసి తదితరులు బుధవారం తప్పుడు సమాచారాన్ని పబ్లిసిటీ చేసినందుకు సమావేశం అయ్యారు. కరుణ పొదుపు గ్రూపు నుండి సభ్యురాలి భర్త చేస్తున్న ఆరోపణలను పొదుపు మహిళలు, వివోఏలు ఖండించారు. కరుణ గ్రూపు సభ్యురాలు అయినటువంటి శోభారాణికి స్త్రీ నిధి 50,000 పొదుపు లోను 50,000 ఇచ్చినట్లు తెలిపారు. అయితే సక్రమంగా చెల్లించకపోవడం వల్ల బ్యాంకు లింకేజీ లోను ఇవ్వలేదన్నారు. రెండు లక్షలు అవినీతి జరిగిందని అప్పులోను చూపిస్తున్నదని పేర్కొనడం అవగాహన లోపం అన్నారు. గ్రూపులోని ఒక సభ్యురాలు వద్ద లక్ష రూపాయలు మరియు ఇతర వాటిల్లో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించకపోవడం వల్లనే వారికి రుణం ఇవ్వలేదని అన్నారు. బ్యాంకు నుండి శోభారాణి అకౌంట్ కు లోను జమ చేయలేదన్నారు. రుణమే ఇవ్వలేదు, అప్పు ఎలా ఉంటుందని పొదుపు మహిళా గ్రూప్ సభ్యులు ప్రశ్నించారు. ఆరోపణలు వచ్చిన కారణంగా లోన్ క్లోజ్ చేయడానికి మహిళలందరూ సిద్ధమై సుమారు 15 లక్షలు చెల్లించటానికి సిద్ధపడగా సభ్యురాలు వద్ద ఒక లక్ష తీసుకున్న రుణం తిరిగి చెల్లించడంలో జాప్యం చేయడం వల్ల లోన్ క్లోజ్ చేయలేదన్నారు. కరుణ పొదుపు లక్ష్మి గ్రూపులో ఎటువంటి అవినీతి గాని అక్రమాలు గానీ జరగలేదని గ్రూపు సభ్యులు మరియు కరుణ గ్రూపు లీడర్లు గిత్తల ప్రియాంక కొమ్ము మేరమ్మ తెలియజేశారు.

## తిమ్మాపురంలో ఘనంగా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు

### ప్రజా సంక్షేమమే పవన్ ధ్యేయం కూటమి నేతలు



**మహానంది సెప్టెంబర్ 02 (నంది పత్రిక):-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని జనసేన నాయకులు కొండమాల చక్రపాణి, బోదెద్దుల రమేష్ పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ 55వ పుట్టినరోజును పురస్కరించుకుని మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని పీర్ల చావిడి దగ్గర జనసేన, టీడీపీ (కూటమి) నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రగతి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని కొనియాడారు. కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఆయన రాష్ట్రాన్ని ముందంజలో ఉంచుతున్నారని హర్షం వ్యక్తం చేశారు.ఈ సంబరాల్లో టీడీపీ మాజీ అధ్యక్షుడు ఉల్లి మధు, మాజీ ఎంపీపీ నాగభూపాల్ రెడ్డి, తెలుగు గంగ 9వ బ్లాక్ చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు వై.బాబు, జనసేన వీర మహిళ బోదెద్దుల మహేశ్వరి, జనసేన నాయకులు పిన్నా కృష్ణమూర్తి, పగడాల విజయుడు, దూదేకుల మురళి మరియు ఇతర కూటమి నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు. మరియు మండలంలోని అన్ని గ్రామాల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు.

## శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం



**మహానంది సెప్టెంబర్ 02 (నంది పత్రిక):-** శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచమని నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం హెడ్ కానిస్టేబుల్స్ వెంకటేశ్వర్లు, డీ ఎన్.ప్రసాద్ పేర్కొన్నారు. మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో శక్తి యాప్,మహిళా భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. శక్తి యాప్ 7993485111 నెంబర్ ను తెలిపి,అత్యవస సమయాలలో 100, 112 నెంబర్ సంప్రదించాలన్నారు.బాల్య వివాహాలు 1098, సైబర్ మోసాలపై 1930 కు కాల్ చేయాలన్నారు.వన్ స్టాప్ సెంటర్ల ప్రాముఖ్యతను వివరించారు. సోషల్ మీడియా వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత విషయాలు,ఓటీపీలు చెప్పవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి



**మహానంది సెప్టెంబర్ 02 (నంది పత్రిక):-** పంట నమోదైన రైతులు వెంటనే ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.రైతులు వెంటనే రైతు సేవ కేంద్రాలను సంప్రదించి ఈకేవైసి పూర్తి చేసుకోవాలన్నారు.అనంతరం పంట పొలాలను సందర్శించి రైతులకు తగిన సూచనలు చేశారు. ఏఈఓ వెంకటేశ్వర్లు,వివోఏ సుభాష్,రైతులు పాల్గొన్నారు.

# తల్లి మరణాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి..!

### జిల్లా స్థాయి మాతృ మరణాల సమీక్ష కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 2: నంది పత్రిక** జిల్లాలో తల్లి మరణాలను పూర్తిస్థాయిలో నివారించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన తల్లి మరణాల పర్యవేక్షణ మరియు స్పందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన తల్లి మరణాల వివరాలు, వాటికి దారితీసిన కారణాలు, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలు, హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, వారికి అందిస్తున్న చికిత్స తదితర అంశాలపై, గత ఐదు నెలల్లో జిల్లాలో సంభవించిన మాతృ మరణాలపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గర్భిణి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ముఖ్యంగా హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులను గుర్తించి, ప్రసవానికి ముందస్తు ప్రణాళిక రూపొందించి, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఉన్నత వైద్య సేవలకు తరలించేలా పటిష్టమైన రిఫరల్ వ్యవస్థను అమలు చేయాలని ఆదేశించారు. తల్లి మరణాలకు కారణాలను లోతుగా విశ్లేషించి, భవిష్యత్తులో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, వారి ఆరోగ్య పరిస్థితి మరియు అవసరాలను సంబంధిత వైద్యాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవ సేవలు, అత్యవసర వైద్య సేవలు, రక్త నిల్వలు, అవసరమైన మందులు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రతి గర్భిణికి పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జున, పిసి పీఎన్డిటీ సభ్యులు ఐసిడిఎస్ పీడి రమాదేవి, డిసిహెచ్ఎస్ డా. రఫీక్ భాష, ఇమ్యూనైజేషన్ అధికారి డా. ప్రవీణ్ కుమార్, రిమ్స్ సూపరింటెండెంట్ డా. పెంచలయ్య, అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. రవిబాబు, గైనకాలజిస్ట్ రేఖా రావు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.900 కోట్ల టన్నెల్ ప్రాజెక్టు.. పోరుమామిళ్లలో తొలి సొరంగ మార్గం ప్రారంభం!

### టన్నెల్ పనుల్లో దూకుడు..

### 2027 మార్చి నాటికి పూర్తి చేస్తాం: మ్యాక్స్ ఇన్ఫ్రా



**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 2 (నంది పత్రిక )**బెంగళూరు నుండి అమరావతికి నిర్మాణం అవుతున్న ఆరు లైన్ల రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా పోరుమామిళ్ల మండలం రజాసాహెబ్ పేట సమీపాన మ్యాక్స్ ఇన్ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు చేపట్టిన రోడ్డు ఎడమ మొదటి సొరంగ మార్గం పనులు పూర్తి దశకు రావడంతో మ్యాక్స్ ఇన్ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చైర్మన్లు ఫణి కుమార్ రెడ్డి, రాజు ఆధ్వర్యంలో బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రీజనల్ ఆఫీసర్ (=ా) హరికృష్ణ హాజరయ్యారు.టన్నెల్ రోడ్డు సొరంగ మార్గంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ టన్నెల్ పనులను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని కష్టసాధ్యమైన పనులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని మ్యాక్స్ ఇన్ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యాన్ని అభినందించారు. టన్నెల్ నిర్మాణ పనులలో పనిచేస్తున్న ఇంజనీర్లను, అధికారులను, సిబ్బందిని అభినందిస్తూ ప్రతిభ కనబరిచిన వారికి మెమెంటోలను అందించారు. జియాలజిస్ట్ విశ్వకర్మకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అనంతరం చైర్మన్లు ఫణి కుమార్ రెడ్డి, రాజు మాట్లాడుతూ టన్నెల్ నిర్మాణ పనులు కష్టసాధ్యమైనప్పటికీ వేగవంతంగా చేస్తున్నమన్నారు. ఫారెస్ట్ అనుమతులు రావడం కొంత ఆలస్యమైనప్పటికీ పనులను వేగవంతంగా చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మేము చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ మాకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. టన్నెల్ నిర్మాణ పనులను 900 కోట్ల రూపాయలతో ప్రారంభించామని ఇప్పటికీ 450 కోట్లు మేర ఖర్చు చేచామన్నారు.చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పనులను వేగువంతంగా చేసి 2027 మార్చి నాటికి పూర్తి చేసి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారికి అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా పిడి అశోక్ కుమార్ రెడ్డి, ఒంగోలు జిల్లా పిడి అనిల్ కుమార్ రెడ్డి, టిఎల్ రమేష్, జియాలజిస్ట్ విశ్వకర్మ, ప్లానింగ్ మేనేజర్లు, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.




# వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం..

### మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు: పోతిరెడ్డి నాగార్జున రెడ్డి



**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 2: (నంది పత్రిక )** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పోరుమామిళ్ల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని వైఎస్ఆర్ విగ్రహంతో పాటు చల్లగిరిగల దేవస్థానం సమీపంలోని వైఎస్ఆర్ ఆలయంలోని విగ్రహానికి, సిద్ధవరం పంచాయతీ అగ్రహారం గ్రామంలోని విగ్రహానికి, కొరపాటిపల్లి పంచాయతీ కాలువ కట్ట వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ఆర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత అని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, పావలా వడ్డీకి రైతులు, డ్వాక్రా మహిళలకు రుణాలు, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేద, సామాన్య ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చారని పేర్కొన్నారు. వైఎస్ఆర్ మరణించిన సమయంలో ఆయన అభిమానులు తీవ్ర ఆవేదనకు గురయ్యారని, ఆయనను స్మరించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వైఎస్ఆర్ వంటి యుగపురుషులు అరుదుగా పుడతారని అన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఐదేళ్లలో వైఎస్ఆర్ తరహాలో సంక్షేమ పథకాలను అమలు చేశారని నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలపై భారం పడుతోందన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, కె. రమణారెడ్డి, దశరథరామిరెడ్డి, అంబవరం రమణారెడ్డి, లక్ష్మిరెడ్డి, జేకే, గొడుగు మస్తాన్, గొడుగు బాబు, పి. పెద్ద బాలయ్య, కృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, గోపాల్ రెడ్డి, రమణయ్యతో పాటు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.



**నందికొట్కూరు సెప్టెంబర్ 2( నంది పత్రిక)** నందికొట్కూరు పట్టణంలో జనసేన పార్టీ నాయకులు నల్లమల రవికుమార్, రామిరెడ్డి, షేక్ వల్లి ఆధ్వర్యంలో జనసేన పార్టీ అధినేత ఏపీ డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పట్టణంలోనే కొత్త బస్టాండ్ వద్ద నుండి బైకుపై ర్యాలీ నిర్వహించి పటేల్ సెంటర్ వద్దకు చేరుకొని కేక్ కట్ చేసి తమ అభిమాన నేత పవన్ కళ్యాణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం హాజరై రక్తదానం చేసిన జనసేన కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో రక్తదానం యొక్క ప్రాముఖ్యత ఎంతో విశిష్టమైనదని, రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడుతుందని అలాంటి సామాజిక సేవ బాధ్యత కలిగిన వ్యక్తులుగా రక్త దానం చేయడం పలువురికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తప్పుడు సమాచారాన్ని ఖండించిన వివో ఏల యూనియన్



**శిరివెళ్ల : (నంది పత్రిక)** సిరివెళ్ల మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీలో గల ఎస్సీ కాలనీలో కరుణ మహిళ పొదుపు లక్ష్మి గ్రూపులోని ఒక సభ్యురాలి భర్త చేసిన తప్పుడు ఆరోపణలు మరియు సమగ్ర సమాచారం లేకుండా తప్పుడు సమాచారాన్ని పబ్లిసిటీ చేసిన ఒక యూట్యూబ్ ఛానల్ వారి వైఖరిని వివోఏల యూనియన్ అధ్యక్షులు ప్రసాద్, మల్లిక మేడం, నారాయణరెడ్డి, నారాయణమ్మ, తదితర వి ఓ ఏ లు ఖండించారు. విధి నిర్వహణలో తమ రికార్డుల పర్యవేక్షణ పై పూర్తిస్థాయి నిఘా ఉంటుందని పై స్థాయిలో పరిశీలించిన తరువాతనే సభ్యులకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. అయితే శిరివెళ్లలోని కరుణ పొదుపు గ్రూపు సంబంధించి ఒక వివోఏ 2 లక్షల రూపాయలు అవినీతికి పాల్పడినట్లు నిరాధారమైన సమాచారాన్ని పబ్లిష్ చేశారని కనీసం వివరణ గాని పూర్తిస్థాయి సమాచారాన్ని గాని తీసుకోకుండా వాస్తవ విరుద్ధమైన తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం పట్ల వారు ఖండించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే యూనియన్ తరపున అధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వెలుగు సిసి మహేశ్వరి మాట్లాడుతూ వెలుగు కార్యాలయంలోకి యూట్యూబ్ వారు, సభ్యురాలి భర్త వచ్చి తమ వివరణను వినకుండా గట్టిగా అరుస్తూ కేకలు వేస్తూ వార్నింగులు ఇవ్వడం జరిగిందని అది చాలదనట్టు తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్టులు చేసి అపనిందలు వేసి బెదిరించిన కారణంగ శిరివెళ్ల పోలీసు వారికి ఫిర్యాదు చేసినట్లు వెలుగు సిసి మహేశ్వరి పేర్కొన్నారు.

## మహానేత వైయస్సార్ కు ఘన నివాళి



**బనగానపల్లె సెప్టెంబర్ 2నందిపత్రిక** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా బనగానపల్లెలో వైసీపీ నాయకులు కార్యకర్తలు మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణం లోని పెట్రోల్ బంక్ కూడలిలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్ర హానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మాజీ శాసన సభ్యులు మహానేత డాక్టర్ వై ఎస్ రాజ శేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు చేసిన సేవలను కొనియాడారు.అనునిత్యం ప్రజల కోసం పరితపించిన మహానేత వైయస్సార్ అని అన్నారు.కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు అత్తర్ జాహిద్ హుస్సేన్,అబ్దుల్ ఫైజ్,సన్నల జనార్ధన్ రెడ్డి,సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, అంబటి రవి రెడ్డి,బండి బ్రహ్మానంద రెడ్డి,జిల్లెళ్ళ శంకర్ రెడ్డి,ఎర్రగుడి రామసుబ్బారెడ్డి, తోట బుచ్చిరెడ్డి,అన్నవరం పార్థసారధి రెడ్డి,కునుకుంట్ల హరి,చౌడయ్య,గౌండా వలి,ఎంపిటిసి వెంకట సుబ్బయ్య, అలిసేన్, దేవుడు,గౌండా నాగరాజు, సాదక్ హుస్సేన్,మోయిన్,కంపమల్ల వెంకటేశ్వర రెడ్డి,గౌస్ పీర్,పెద్దన్న,సెల్ పాయింట్ వలి,మెకానిక్ అబెద్, హైదర్, మద్దయ్య, గౌండా కంబగిరి ,గడ్డం అమీర్,కార్పెంటర్ చాంద్ బాషా, అంజాద్,మహమ్మద్ హుస్సేన్,శివవరం మధు, తమ్మడపల్లె మధు,రైస్ మిల్లు సుబ్బారెడ్డి,వైఎస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## 10 ఏళ్ల బాలికపై అత్యాచార యత్నం: వృద్ధుడిపై కేసు నమోదు

**వెలుగోడు సెప్టెంబర్ 02 నంది పత్రిక:** వెలుగోడు పట్టణం కు చెందిన 10 సంవత్సరాల మైనర్ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి. సురేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 01.09.2026 మధ్యాహ్నం సమయంలో బాలిక తన ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా, అదే గ్రామానికి చెందిన చిన్న బయన్న (సుమారు 60 సంవత్సరాలు) అనే వ్యక్తి ఆ చిన్నారిని వెలుగోడు ఊరి బయట ఉన్న శివాలయం వెనుక చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై చిన్నారికి వరుసకు అన్న అయ్యే బత్తుల వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సురేష్ వెల్లడించారు.

## ఘనంగా వైయస్సార్ వర్ధంతి..

### వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైసీపీ నాయకులు



**చాగలమర్రి సెప్టెంబర్ 2 నంది పత్రిక** చాగలమర్రి మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీలో బుధవారం దివంగత నేత మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని వైసిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా, వర్గ విభేదాలు లేకుండా రైతు బాంధవుడుగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్మనీయుడుగా నిలిచిపోయారన్నారు. వర్ధంతి కార్యక్రమంలో వైసిపి నాయకులు షేక్ బాబూలాల్, నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ సేవలు స్ఫూర్తిదాయకం.. ఘనంగా జన్మదిన వేడుకలు



**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 2 (నంది పత్రిక )** జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కడప జిల్లా పోరుమామిళ్ల మండలం టేకూరుపేట పంచాయతీ, కప్పలపల్లె ప్రాంతాల్లో కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా జన్మదిన వేడుకలు జరిపారు. టేకూరుపేట పంచాయతీలో అంకాల పుల్లయ్య, గాలి శశికుమార్, ఆకుల మునయ్య, కొప్పుల తిరుమల, బుల్లెట్ భాషా, గాలి రమణయ్య, చెప్పల వెంకటేశు తదితరులు పాల్గొన్నారు. అలాగే కప్పలపల్లెలో టీడీపీ యువ నాయకులు కేక్ కటింగ్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం, యువతకు అవకాశాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పవన్ కళ్యాణ్ కీలకంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ఆయురారోగ్యాలతో సుదీర్ఘకాలం ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుక



**కోవెలకుంట్ల సెప్టెంబర్ 2నంది పత్రిక** జనసేన అధ్యక్షులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు బుధవారం కోవెల కుంట్లలో జనసేన నాయకులు ఘనంగా జరిపారు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసు పత్రిలో వేడుక కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కార్యక్రమం లో జనసేన నాయకులు దొడియం గురప్ప, కోవెలకుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చెన్న కృష్ణుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అల్లా బాకాష్,ఖాదర్,రమేష్, సంజీవ, దిలీప్, మస్తాన్ పాల్గొన్నారు.

## ఐఐటీ విద్యార్థులకు 100 స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని హిమంత బిశ్వ శర్మ నిర్ణయం

ఐఐటీ గువాహటికి చెందిన 100 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు అసోం ప్రభుత్వం తరఫున ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు అందించాలని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐఐటీ గువాహటి 33వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, ఈ స్కాలర్‌షిప్ పథకానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను తక్షణమే సిద్ధం చేయాలని ఐఐటీ గువాహటి డైరెక్టర్ సహా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐఐటీ గువాహటి కేవలం విద్యా సంస్థ మాత్రమే కాదని.. అసోంతో పాటు మొత్తం ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు నిలువెత్తు ప్రతీక అని కొనియాడారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన సాంకేతిక, అభివృద్ధి సవాళ్లకు ఆధునిక పరిష్కారాలు కనుగొనడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే వేదికపై విద్యార్థుల మానసిక ఒత్తిడిని ఉద్దేశించి సీఎం హిమంత బిశ్వ శర్మ ఇచ్చిన సందేశం అందరినీ ఆకట్టుకుంది. జీవితం అనేది అందరి కంటే ముందుండాలనే పరుగుపందెం కాదని, ఒకవేళ అందరికంటే వేగంగా వెళ్లలేకపోయినా ఎవరూ వెనుకబడిపోయినట్లు భావించాల్సిన అవసరం లేదని విద్యార్థులకు హితవు పలికారు. చదువుతో పాటు వ్యక్తిగత సమతుల్యతను కాపాడుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

## పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా నంద్యాలలో రక్తదాన శిబిరం

### ప్రారంభించిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 02 ( నంది పత్రిక )** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జనసేన రక్త నిధి ఆధ్వర్యంలో నంద్యాల మున్సిపాలిటీ ఆఫీస్ పక్కన ఉన్న పి.ఎ.వి కాంప్లెక్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా 'మహా రక్తదాన శిబిరం' నిర్వహించారు. విజయ బ్లడ్ సెంటర్ (నంద్యాల) వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , తాతిరెడ్డి మనీష్ రెడ్డి ముఖ్యఅతిథిలుగా విచ్చేసి శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు పోకుండా, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆదుకునేందుకు ఇలా రక్తదాన శిబిరాలుగా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. యువత రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజలకు నిరంతరం సేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు రాచమడుగు చందు, రాచమడుగు సుందర్, రాచమడుగు రాంబాబు, సంఘ జయంతి, బుగ్గ రాముడు, గోవింద నాయుడు తదితరులుపాల్గొన్నారు



## పాఠశాలల మౌలిక నమోదులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

### క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాఠశాలలను సందర్శించి హెచ్ఎంలతో సమన్వయం చేసుకోవాలి
### పూర్తయిన పనుల వివరాలను ఫోటోలతో సహా తక్షణమే పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి క్లోజ్ చేయాలి
### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, సెప్టెంబరు 02(నంది పత్రిక):–** ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రస్థాయి ర్యాంకుల్లో జిల్లా పనితీరు మెరుగుపడేలా అధికారులు సమన్వయంతో పనిచేసి, పెండింగ్‌లో ఉన్న డేటా ఎంట్రీ, స్టేటస్ అప్‌డేట్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి 'మన బడి – మన భవిష్యత్తు' కార్యక్రమం కింద పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనుల పురోగతిపై విద్యాశాఖ, సమగ్ర శిక్ష, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులు, ఎంఈఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సైట్ ఇంజనీర్లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పాఠశాలల మౌలిక వసతుల కాంపోనెంట్లకు సంబంధించిన డేటా ఎంట్రీలో జిల్లా పనితీరు ఆశించిన స్థాయిలో లేదన్నారు. పాఠశాలల్లో పనులు పూర్తయినప్పటికీ వాటి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తయిన ప్రతి పనికి సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం ఫోటోలతో సహా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఇప్పటికే పూర్తయిన పనులను సంబంధిత ప్రధానోపాధ్యాయులు తమకు కేటాయించిన 'మన బడి – మన భవిష్యత్తు' లాగిన్ ద్వారా పరిశీలించి, పనులు పూర్తయినట్లు క్లోజ్ ఆప్షన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. పని పూర్తయినట్లు ధ్రువీకరించేందుకు నిబంధనల మేరకు మూడు వైపుల నుంచి స్పష్టమైన ఫోటోలను అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పూర్తయిన పనులను గుర్తించి, వాటి వివరాలు సరైన విధంగా పోర్టల్‌లో నమోదయ్యేలా చూడటంలో క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ సిబ్బంది కీలక బాధ్యత వహించాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ పరిధిలోని ప్రతి పాఠశాలను వ్యక్తిగతంగా సందర్శించి, ప్రధానోపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో పూర్తయిన అన్ని కాంపోనెంట్లకు సంబంధించిన పనుల వివరాలను సమగ్రంగా అప్‌డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టాయిలెట్ల నిర్మాణం, మరమ్మతులు, మేజర్, మైనర్ రిపేర్లు, విద్యుదీకరణ పనులు, తాగునీటి సదుపాయాలు, ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటు, ఫర్నిచర్, డ్యూయల్ డెస్క్‌ల ఏర్పాటు, గ్రీన్ చాక్ బోర్డుల ఏర్పాటు, పాఠశాలల పెయింటింగ్ పనులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు పూర్తయి ఉంటే వాటి ప్రస్తుత స్థితిని పరిశీలించి, అవసరమైన ఫోటోలను అప్‌లోడ్ చేసి, సంబంధిత లాగిన్‌లలో స్టేటస్ అప్‌డేట్ చేసి క్లోజ్ చేయలని పంచాయతీరాజ్, సమగ్ర శిక్ష, గిరిజన సంక్షేమ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనులు పూర్తయినప్పటికీ పోర్టల్‌లో వివరాలు ఎందుకు నమోదు కాలేదో సంబంధిత అధికారులు పరిశీలించి, పెండింగ్ కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. డి ఈ ఓ , ఎం ఈ ఓ లు ఇంజనీరింగ్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, మండలాల వారీగా పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. అలాగే, సంబంధిత ఏఈ లాగిన్‌లో కూడా అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి, డేటా ఎంట్రీలో ఎటువంటి పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 2, నంది పత్రిక** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని బుధవారం ఆళ్లగడ్డ టి ఎస్ ఫంక్షన్ హాల్లో జనసేన సమన్వయకర్త మైలేరి మల్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా నాలుగు రోడ్ల కూడలి నుండి ఎస్బీఐ, ప్రతాప్ టాకీస్, సీఎస్ఐ చర్చి, పాత బస్టాండ్ మీదుగా పడకండ్ల బ్రిడ్జి వరకు జనసైనికులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టి ఎస్ ఫంక్షన్ హాల్లో జనసేన నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. అలాగే వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మైలేరి మల్లయ్య ప్రారంభించి, రక్తదానం చేసిన దాతలను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరు పని చేయాలని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నరేంద్ర, జమాల్, కోటి, సురేంద్ర, తెజ్, సుబ్బారాయుడు, వెంకట సుబ్బయ్య, జగదీష్, దేవా ఆంజనేయులు, గుర్రప్ప, శ్రీకాంత్, కేశవ, ఈశ్వరయ్య, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## బ్యాంకులో సిబ్బంది సహకరించలేదని..



**బండి ఆత్మకూరు నంది పత్రికసెప్టెంబర్ 2 :** బండి ఆత్మకూరు సెంట్రల్ బ్యాంక్ లోని సిబ్బంది తనకు సహకరించలేదని పురుగుల పొడి తాగిన సంఘటన వెలుగులోనికి వచ్చింది. గడివేముల మండలం కరిమద్దెల గ్రామానికి చెందిన అనకల రాము (32) తమ బంధువులతో కలిసి బండి ఆత్మకూరులోని సెంట్రల్ బ్యాంకుకు వచ్చాడని తెలుస్తోంది. ఇందుకు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు ఆధార్ కార్డు తీసుకొని రావాలని బ్యాంకు సిబ్బంది రాముకు చెప్పినట్లుగా తెలుస్తోంది. ఆధార్ కార్డు తీసుకుని వచ్చిననంతరం వివరాలు పరిశీలించగా రాముకు సంబంధించి ఖాతా లేదని సిబ్బంది చెప్పినట్లుగా తెలుస్తోంది. తర్వాత మరో ఓచర్ ఆధారంగా వివరాలను పరిశీలిస్తున్న సమయంలో సర్వర్ సమస్య తలెత్తిందని బ్యాంకు సిబ్బంది చెప్పినట్లుగా తెలుస్తోంది. బ్యాంకు సిబ్బంది పని తీరుపై అసహనం వ్యక్తం చేసిన రాము పురుగుల మందు తాగుతానని సిబ్బందిని హెచ్చరించి బయటకు వెళ్లాడని సమాచారం. తర్వాత పురుగుల పొడితో బ్యాంకు వద్దకు వచ్చి, తనకు జరుగుతున్న విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పినట్లుగా తెలుస్తోంది. ఆ ప్రాంతం నుండి ద్విచక్ర వాహనంపై పోలీస్ స్టేషన్ కి వెళ్ళిన రాము పోలీస్ గేట్ వద్ద పడిపోవడంతో, పోలీసులు వెంటనే అతనిని బండి ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించిన మేరకు మెరుగైన వైద్యం కోసం రాముని పోలీసులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వాసులకు తరలించారు. ఈ విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## గణేష్ ఉత్సవాలకు అన్ని శాఖలు సహకరించాలి



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 2 నందిపత్రిక** ఆళ్లగడ్డ మండలంలో ఈ నెల 14 నుండి జరగనున్న గణేష్ ఉత్సవాల సందర్భంగా అధికారులు అన్ని శాఖలు సమన్వయంతో సహకరించాలని గణేష్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది విజయభాస్కర్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆళ్లగడ్డ మండల డిప్యూటీ తాసిల్దార్ విజయలక్ష్మి కి బుధవారం గణేష్ కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, పుల్లయ్య, చంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

### నంద్యాలలో ఈ నెల 20న జరిగే జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయండి



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 2 నంది పత్రిక** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర సభ్యులు ముల్లా నిజాముద్దీన్, తాలూకా అధ్యక్షులు కరణం శ్రీనివాసులు, కోశాధికారి నాగరాజు తెలిపారు. బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తి భద్రత కోసం సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉండి సంఘాన్ని బలోపేతం చేయాలని, ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకుని సంఘ కార్యకలాపాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులకు వెల్ఫేర్ ఫండ్ రూ .50 కోట్లు కేటాయించాలని, ఇళ్ల స్థలాలు, చిన్న పత్రికల జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అలాగే వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం , రైల్వే పాసుల పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జరిగే ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రథమ మహాసభలో జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు సుబ్బారావు, అక్షింతల శ్రీనివాసులు, సిహెచ్ బ్రహ్మం, ఓబులం ప్రసాద్, ఇస్మాయిల్ బేగ్, టీవీఎస్ వి ప్రసాదు, మహమ్మద్ హుస్సేన్, డిడి 8 భాష , తేజ న్యూస్ శ్రీధర్, ముల్లా జాఫర్ పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో జిల్లా ఆర్థిక ప్రగతికి బాటలు



**పర్యాటకుల రాక పెంచేలా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి**

**పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి జిల్లా జీడీపీ వృద్ధికి దోహదపడాలి**

**పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వండి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 02(నంది పత్రిక):–** జిల్లాలోని పర్యాటక, ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాంతాలను అభివృద్ధి చేసి, పర్యాటకుల రాకను పెంచడం ద్వారా జిల్లా జీడీపీ వృద్ధికి దోహదపడేలా కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ప్రాంతీయ పర్యాటక అధికారి ఓబులమ్మ, జిల్లా పర్యాటక అధికారి సునీల్ కన్నా, సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు, పర్యాటకుల అవసరాలకు అనుగుణంగా కనీస మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించాలన్నారు. పర్యాటకుల రాక పెంచేందుకు సాధారణ ప్రతిపాదనలకు పరిమితం కాకుండా స్పష్టమైన లక్ష్యాలు, ఫలితాలతో కూడిన ప్రాక్టికల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యాటక అవకాశాలు, వనరులు, అవసరాలు భిన్నంగా ఉన్నందున ప్రాంతాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు. కొలిమిగుండ్ల, సంగమేశ్వరం, సూర్యనారాయణ స్వామి ఆలయం, నందికొట్కూరు తదితర ప్రాంతాల్లో ఉన్న ఆధ్యాత్మిక, చారిత్రక, ప్రకృతి పర్యాటక అవకాశాలను గుర్తించి, వాటికి అవసరమైన సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. రహదారి సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే వసతులు, ఆహార సదుపాయాలు, పారిశుద్ధ్యం వంటి కనీస సౌకర్యాల లభ్యత పర్యాటకుల అనుభవాన్ని ప్రభావితం చేస్తాయని కలెక్టర్ తెలిపారు. పర్యాటక ప్రాంతాలకు సులభమైన రాకపోకలు ఉండేలా రహదారి సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు, సందర్శకులకు అవసరమైన ప్రాథమిక వసతులను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

**మౌలిక వసతుల పనులు వేగవంతం చేయాలి**

పర్యాటక ప్రాంతాల్లో నిర్మిస్తున్న టాయిలెట్ బ్లాక్‌లు, లైటింగ్, రన్నింగ్ వాటర్ తదితర పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. సూర్యనంది క్షేత్రంలో సుమారు రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షల వ్యయంతో చేపట్టిన లైటింగ్ పనులు పూర్తయ్యాయని, మరుగుదొడ్ల నిర్మాణ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయన్నారు. పర్యాటక ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల జాబితాను సిద్ధం చేసి, సంబంధిత ఎస్ఈ, ఆర్ఎన్ఓలతో సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు, నిధుల వినియోగ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సిద్ధేశ్వరం ప్రాంతంలో హెల్త్ రిసార్ట్ ఏర్పాటు చేస్తే శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు అనుకూలమైన ప్రశాంత వాతావరణాన్ని పర్యాటకులకు అందించవచ్చని తెలిపారు.

**పారిశుధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత** పర్యాటక ప్రాంతాల్లో ఫ్లోరింగ్, ఫినిషింగ్ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నవాబ్ బంగ్లా పైభాగం దెబ్బతిన్న నేపథ్యంలో సందర్శకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం బయటి ప్రాంతం నుంచి మాత్రమే సందర్శించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల వివరాలు, చారిత్రక ప్రాధాన్యత, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై సందర్శకులకు సులభంగా సమాచారం అందేలా క్యూఆర్ కోడ్‌లు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు పనులను 10 రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్తీక మాసంలో జిల్లాలో నంది ఉత్సవాలను నిర్వహించే దిశగా సమగ్ర డీపీఆర్‌ను సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా పర్యాటక అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై పాఠశాల విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని, తద్వారా స్థానిక పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను భావితరాలకు పరిచయం చేయాలని కలెక్టర్ సూచించారు.

# కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

**ప్రమాదాల నివారణకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలి**

**మాక్‌డ్రిల్ లను తరచూ నిర్వహించాలి : జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్**



**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 02(నంది పత్రిక):–** జిల్లాలోని కర్మాగారాల్లో ప్రమాదాల నివారణకు నిర్దేశించిన నిబంధనల ప్రకారం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ కర్మాగారాల యాజమాన్యాల ప్రతినిధులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ, కర్మాగారాల్లో ప్రమాదాలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ కర్మాగారంలో అమలు చేస్తున్న భద్రతా చర్యలను సమీక్షించి, అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు చేపట్టాల్సిన కార్యాచరణపై సంబంధిత ప్రతినిధులను ప్రశ్నించి వివరాలను తెలుసుకున్నారు. కర్మాగారాల్లో మాక్‌డ్రిల్లను క్రమం తప్పకుండా నిర్వహించాలని, వాటిలో అగ్నిమాపక, పోలీస్, అత్యవసర సేవల విభాగాల అధికారులు, సిబ్బంది కూడా భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. మాక్‌డ్రిల్ల ద్వారా లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దుకోవడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత మేరకు నివారించేందుకు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. అంతకుముందు ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఐ. నారాయణ రెడ్డి జిల్లాలోని కర్మాగారాల పరిస్థితి, భద్రతా ప్రమాణాలు, ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమావేశంలో వివరించారు. జిల్లాలో మొత్తం 32 కర్మాగారాలను ప్రమాదకర కర్మాగారాలుగా గుర్తించామని, వీటిలో ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ కర్మాగారాన్ని అత్యధిక తీవ్ర ప్రమాదకర కర్మాగారంగా గుర్తించినట్లు తెలిపారు. కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఫ్యాక్టరీస్ శాఖ ఆధ్వర్యంలో తరచుగా సేఫ్టీ కార్యక్రమాలు, భద్రతా శిక్షణలు, మాక్‌డ్రిల్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది సమర్థవంతంగా స్పందించేలా అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. సమావేశంలో వివిధ కర్మాగారాల ప్రతినిధులు తమ తమ పరిశ్రమల్లో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, అత్యవసర నిర్వహణ ప్రణాళికలు, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పోలీస్ శాఖ, మున్సిపల్ కమిషనర్, కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా అగ్నిమాపక అధికారి, ఏపీఎస్‌పీడీసీఎల్, సూపరింటెండెంట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, వ్యవసాయ, రవాణా తదితర శాఖల అధికారులు, వివిధ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న సెయిల్ సోలార్ కంపెనీ యాజమాన్యంపై వెంటనే చర్య తీసుకోవాలి






**రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం డబ్బులు మరియు లీజు ఒప్పందం డబ్బులు వెంటనే ఇవ్వాలి**

**రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు కదిలేది లేదు**

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సెయిల్ సోలార్ కంపెనీ ముందు బైఠాయించిన రైతులు**

**4.గోవింద పల్లి గ్రామం నుంచి ర్యాలీగా వస్తున్న రైతులు**

**ఆళ్లగడ్డ: ప్రతినిధి సెప్టెంబర్ 2 నందిపత్రిక** ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఉయ్యాలవాడ మండలం గోవిందపల్లి గ్రామ సమీపంలోని దిగువ కల్వటాల వద్ద ఉన్న సోలార్ ప్లాంట్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. రైతులను మోసం చేస్తున్న సెయిల్ సోలార్ కంపెనీ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకొని రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం డబ్బులు మరియు లీజు ఒప్పందం డబ్బులు వెంటనే ఇవ్వాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులు సెయిల్ సోలార్ కంపెనీ మెయిన్ గేట్ వద్ద రైతులు ధర్నా చేపట్టి బైఠాయించారు. నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలంలోని గోవిందపల్లి, మాయలూరు, ఆర్ . పాశీపల్లె మరియు కడప జిల్లాలోని కల్వటాల గ్రామాల రైతులు ఆందోళన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి . రామ చంద్రుడు, జిల్లా అధ్యక్షుడు ఏ .రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సుబ్బారాయుడు, మరియు గోవింద పల్లె గ్రామం మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కల్వటాల గ్రామ పెద్దలు, రైతు నాయకులు మునగాల శ్రీనివాసరెడ్డి, గుండ్లకుంట శ్రీనివాసులు, తలారి మధు కుమార్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో సోలార్ వల్ల భూములు కోల్పోయిన రైతులు ధర్నా చేపట్టారు. నిరసన చేపట్టిన రైతులను, రైతు సంఘం నాయకులను లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు మరియు రైతులు, రైతు నాయకుల మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మరియు గ్రామ రైతు పెద్దలు మాట్లాడుతూ రెండు జిల్లాల పరిధిలో సుమారు 2000 ఎకరాల రైతుల పట్టా భూములు మరియు డికెటి ఉన్న భూములను ఎకరా 8 లక్షల నుండి 18 లక్షల వరకు రేటుకు కొనుగోలు చేస్తామని అడ్వాన్సుగా కొంత డబ్బులు చెల్లించి పూర్తి రిజిస్టర్ చేయించుకుని ఇప్పటికీ మిగిలిన డబ్బులు చెల్లించకుండా సోలార్ కంపెనీ వాళ్ళు రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. అలాగే 29 సంవత్సరాల 11 నెలలకు లీజు ఒప్పందంతో ఎకరాకు 32వేల రూపాయలు కౌలుగా చెల్లిస్తామని గత మూడు సంవత్సరాల క్రితం పైన ఒప్పందాలు చేసుకున్నారని, అలాగే ఎలాంటి ఒప్పందాలు చేసుకోకుండా, కొనుగోలు చేయకుండా చాలామంది రైతుల భూములలో సోలార్ ప్లేట్లను బిగించి ఉత్పత్తి చేసుకుంటున్నారన్నారు. గత మూడు సంవత్సరాల క్రితం నుండి రైతులు కంపెనీల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్న వారికి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా, విభజించు పాలించు పద్ధతిలో రైతుల మధ్య అనైక్యత సృష్టిస్తూ మధ్య దళారులను , పోలీసులను ఉపయోగించుకుని రైతుల పైన దౌర్జన్యం చేయడం చాలా అన్యాయమని అన్నారు. ఎలాంటి గ్రామసభలు జరుపుకుండా, రైతులకు నోటీసులు ఇవ్వకుండా, రైతుల రైతుల అభిప్రాయాల్ని పట్టించుకోకుండా చట్ట



విరుద్ధంగా భూములు తీసుకుంటున్న జిల్లాల కలెక్టర్లు, మరియు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రైవేట్ సోలార్ సాజుజూ కంపెనీ యాజమాన్యం పైన వెంటనే ప్రభుత్వం చర్య తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కంపెనీ యాజమాన్యం వారు రైతుల వద్దకు వచ్చి రైతాంగానికి ఇవ్వాల్సిన నష్టపరిహారం, లీజు ఒప్పంద డబ్బులు వెంటనే చెల్లించే వరకు, భూములు కోల్పోయిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించే వరకు తాము ఇక్కడ నుంచి కదలమని బిస్మించి కూర్చున్నారు. ఈ సందర్భంగా కడప జిల్లా సిఐ మరియు పెద్ద ముడియం ఎస్ఐ, ఉయ్యాలవాడ పోలీస్ యంత్రాంగం అందరూ రైతులని లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో పెద్ద ఎత్తున రైతాంగం కంపెనీ యాజమాన్య రైతుల వద్దకు రావాలని నినాదాలు ఇవ్వగా పోలీస్ అధికారులు వెంటనే కంపెనీ యాజమాన్యంతో ఫోన్లో సంభాషణలు జరిపారు. యాజమాన్యం రెండు రోజుల్లో వస్తానని ఫోన్లో చెప్పగా అందుకు రైతులు ఒప్పుకోలేదు. వెంటనే ఆందోళన జరుగుతున్న స్థలం వద్దకే యాజమాన్యం వచ్చి మీడియా సమక్షంలో సమస్యలు పరిష్కరిస్తేనే ఇక్కడి నుంచి వెళ్తామని లేకపోతే గేటు ముందు టెంట్ వేసుకుని ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళ రైతులు గంగమ్మ, కళావతి తో పాటు గ్రామాల రైతులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సురేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశం మందిరములో సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 2, నంది పత్రిక** ప్రధాన ఖనిజ బ్లాకుల వేలానికి సంబంధించిన అభ్యంతర రహిత ధృవీకరణ పత్రాల జారీని వేగవంతం చేయాలిరాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ఖనిజ సంపదను, ఖనిజ ఆదాయాన్ని సమకూ ర్చేందుకు వీలుగా ప్రధాన ఖనిజ బ్లాకుల వేలానికి సంబంధించిన అభ్యంతర రహిత ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని గనులు, భూగర్భశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గనులు, ఖనిజ వనరుల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణ తదితర అంశాలపై గనులు, భూగర్భశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా బుధవారం అమరావతి నుంచి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, ప్రధాన అటవీ సంరక్షణ అధికారి, అటవీశాఖ ఉన్నతాధికారులతో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లతో దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ఖనిజ సంపదను, ఖనిజ ఆదాయాన్ని సమకూర్చేందుకు వీలుగా ప్రధాన ఖనిజ బ్లాకుల వేలానికి సంబంధించిన అభ్యంతర రహిత ధృవీకరణ పత్రాలు అన్ని జిల్లాల నుంచి త్వరితగతిన జారీ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో గనుల తవ్వకాలు, ఖనిజాల రవాణా, అనుమతులు, పర్యావరణ నిబంధనల అమలు తదితర అంశాలపై జిల్లాల వారీగా అధికారులు చేపడుతున్న చర్యలను సమీక్షించారు.గనుల తవ్వకాలకు అనుమతులు మంజూరైన అనంతరం వాటి కారణంగా పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కాలుష్య నియంత్రణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గాలి, నీరు, నేల కాలుష్యానికి కారణమయ్యే కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు.అటవీ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా గనుల కార్యకలాపాలు నిర్వహించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అటవీ భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. గనులు, భూగర్భశాఖ, కాలుష్య నియంత్రణ మండలి, అటవీశాఖ, రెవెన్యూ తదితర విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తే గనుల వనరుల సక్రమ వినియోగంతో పాటు పర్యావరణ పరిరక్షణను సమర్థవంతంగా సాధించవచ్చని ముఖ్య కార్యదర్శి తెలిపారు.పశ్చిమగోదావరి జిల్లా భీమవరం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని సముద్ర ఇసుకకు సంబంధించిన సాధ్యాసాధ్యాల నివేదికను పంపించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా స్థాయి గనులు, రెవెన్యూ, అటవీ, కాలుష్య నియంత్రణ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం.. ఆర్థిక లోటు ఉన్నా సంక్షేమం ఆపలేదు:

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తమ ప్రజా పాలనలో సామాన్యుల కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. చఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్–1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు.

కేటీఆర్ హద్దులు మీరి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో కొల్లగొట్టిన భూములు, ఆస్తులపై విచారణ జరుగుతోందని, 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. నిజమైన ప్రతిపక్ష హోదాకు కేసీఆర్ పూర్తిగా అనర్హుడని విమర్శించారు.



# పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలో ఒక రోల్ మోడల్ గా నిలిచింది
# ఇదే స్ఫూర్తితో భవిష్యత్ రోజుల్లో కూడా కొనసాగాలి





## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 2 నంది పత్రిక**
"పురుష కలెక్టర్ల కంటే మిన్నగా పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధి కోసం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పనిచేస్తున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు ..."సీఎం కార్యక్రమం విజయవంతం.. సమష్టి కృషికి ఫలించిన సంతోషం...కార్యక్రమంలో ఎదురైన సవాళ్లను సమర్థంగా అధిగమించిన జిల్లా యంత్రాంగం..కష్టానంతరం వచ్చే సంతోషం మరింత మధురం.. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పశ్చిమగోదావరి జిల్లా పర్యటనను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా జిల్లా అధికారుల యంత్రాంగం జిల్లా కలెక్టరేట్ లో పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరం బుధవారం నిర్వహించిన విజయోత్సవ సభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ ను ఘనంగా సన్మానించి, ఆమెతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎదురైన పలు సవాళ్లను సమన్వయంతో అధిగమించి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగంను అభినందించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా చేపట్టిన ఏర్పాట్లు, ఎదురైన సవాళ్లు, వాటిని అధికారులు సమన్వయంతో అధిగమించిన తీరును ఈ సందర్భంగా అధికారులు జిల్లా కలెక్టర్ తో పంచుకున్నారు. ముఖ్యమంత్రి బోటు రైడ్ నుంచి కార్యక్రమం ముగిసే వరకు ప్రతి ఘట్టాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి బోటు రైడ్ సందర్భంగా చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు కల్పించిన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రోటోకాల్, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసిన తీరును అభినందించారు. పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలో ఒక రోల్ మోడల్ గా నిలిచింది, ఇదే స్ఫూర్తితో భవిష్యత్ రోజుల్లో కూడా కొనసాగాలని ఆమె అధికారులకు సూచించారు. కష్టానంతరం వచ్చే సంతోషం మరింత మధురంగా ఉంటుంది అన్న భావనను ప్రతిబింబించేలా, ముఖ్యమంత్రి కార్యక్రమం కోసం గత కొద్దిరోజులుగా నిర్విరామంగా పనిచేసిన అధికారులు, సిబ్బంది కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో విజయానందాన్ని పంచుకున్నారు. కార్యక్రమం విజయవంతం కావడం వెనుక ప్రతి ఒక్కరి సమష్టి కృషి ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎదురైన అనుభవాలను భవిష్యత్‌లో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాలకు మార్గదర్శకంగా తీసుకోవాలని సూచించారు. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణను మరింత పకడ్బందీగా రూపొందించుకోవాలని ఈ సందర్భంగా అధికారులు నిర్ణయించారు. పెద్దఎత్తున జరిగే ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ముందస్తు ప్రణాళిక, శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన నిర్ణయాలు, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని చర్చించారు. జిల్లా అభివృద్ధి కోసం మహిళా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పురుష కలెక్టర్‌తో పోటీ పడుతూ వారి కన్నా మిన్నగా ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించడం ఈ జిల్లాకు గర్వకారణమని శ్రీ శక్తి కి నిదర్శనమని జిల్లా అధికారుల యంత్రాంగం హర్షం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఒక స్ఫూర్తిదాయకమైన ఉదాహరణగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా అధికారులు తమ భావనలు పంచుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు, సిబ్బంది కలిసి కేక్ కట్ చేసి కార్యక్రమ విజయాన్ని పురస్కరించుకుని విజయానందాన్ని పంచుకున్నారు. పరస్పరం అభినందనలు తెలుపుకుంటూ ఇదే సమష్టి స్ఫూర్తితో భవిష్యత్‌లోనూ ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి గ్లోరియా, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదంపై పాక్‌కు మరోమారు హెచ్చరిక !

సింధుజలాలపై గొంతు చించుకున్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఉగ్రవాదంపై ఒక్కమాటా మాట్లాడ లేదు. రాజకీయాలకు నదీజలాలను వాడుకోవడాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ. సింధూజలాలు ఆపడం వల్ల పాక్‌లో రైతులు,ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ఆపరేషన్ సిందూర్ తరవాత భారత్ సిందూ జలాలను పాక్‌కు నిలిపివేయడంపై కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రస్తావించారు. అయితే తమదేశం ఉగ్రవాదనికి మద్దతు ఇవ్వదని ఒక్కమాటా చెప్పలేదు. అయితే ఇదే సందర్భంలో మోడీ పాక్‌పై ఎదురుదాడి చేశారు. ప్రధాని మోడీ ఉగ్రవాదంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు అంతర్జాతీయ సమాజం గట్టి సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదం ఎప్పటికీ వ్యూహాత్మక ఆస్తి కాదు అని మోడీ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సమక్షంలోనే చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఓ రకంగా షెహబాజ్‌కు ఇది ఓ హెచ్చరికల లాంటిది. ఎస్‌సీవో దేశాధినేతలను ఉద్దేశించి మోడీ మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని తమ విధానాలను అమలు చేసేందుకు సాధనంగా ఉపయోగించే దేశాలను ఉపేక్షించకూడదన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం, వారికి మద్దతు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడే దేశాలకు అంతర్జాతీయ సమాజం నుంచి గట్టి హెచ్చరిక వెళ్లాలని అన్నారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటు లేదనే విషయాన్ని మనమంతా ఒకే గొంతుతో చెప్పాలి. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు ఉగ్రవాదం వ్యూహాత్మక ఆస్తి కాదనే బలమైన సందేశం ఇవ్వాలని మోడీ పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికపై మోడీ భారత్ గళాన్ని గట్టిగా వినిపించారు. ఇది ఓ రకంగా చెప్పాలంటే హెహబాజ్‌కు సూటిగా తగిలివుంటుంది. ఉగ్రవాదానికి సంబంధించిన మొత్తం వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ అన్నారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఉగ్రవాదుల నియామకం, తీవ్రవాద భావజాలం వైపు మళ్లించడం, వారికి సురక్షిత స్థావరాలు కల్పించడం వంటి అన్ని అంశాలపై దేశాలు కలిసి పనిచేయాలని సూచించారు. 2025లో జరిగిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మోడీ తాజా వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్.. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్య చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రవాదంపై భారత్ వైఖరిని మోడీ మరోసారి స్పష్టం చేశారు. మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో దేశాల మధ్య సహకారం అవసరమని మోడీ అన్నారు. అయితే ఇలాంటి ప్రాజెక్టులు ఇతర దేశాల సార్వభౌమ భూభాగాన్ని గౌరవించేలా ఉండాలని స్పష్టం చేశారు. బిష్కెక్‌లో జరిగిన ఈ సమావేశానికి మోడీ, షెహబాజ్ షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో, కజకిస్థాన్ అధ్యక్షుడు కాసిమ్–జోమార్ట్ టోకయేవ్, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్, తజికిస్థాన్ అధ్యక్షుడు ఎమోమాలి రహ్మాన్ తదితరులు హాజరయ్యారు.పరస్పర విశ్వాసం, స్నేహం, పొరుగు దేశాలతో సత్సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు వివిధ రంగాల్లో పరస్పర ప్రయోజనకరమైన సహకారాన్ని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యాలు. 2001లో చైనా, రష్యా, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్ దేశాలతో ఈ సంస్థ ఏర్పడింది. 2017లో భారత్, పాకిస్థాన్ పూర్తిస్థాయి సభ్యదేశాలుగా చేరాయి. 2023లో ఇరాన్, 2024లో బెలారస్ సభ్యదేశాలుగా చేరాయి. ఈ సదస్సు ద్వారా భారత్ ఎప్పటికప్పుడు ఉగ్రవాదంపై హెచ్చరిస్తూనే ఉంది. ఉగ్రవాదం ప్రపంచాన్ని తుడిచిపెట్టే మహమ్మారి అని కూడా హెచ్చరించారు. పాక్ ఇలాంటి నీతలకు లొంగి వైఖరి మార్చుకుం టుందని అనుకోవడం పొరపాటు. అక్కడ ఉగ్రవాదులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నారు.

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. అమెరికా దాడులతో మళ్లీ అనిశ్చితి ఏర్పడింది. మంగళవారం రాత్రి అమెరికా దాడులు చేయడంతో ఇరాన్ కూడా ప్రతీకార దాడులకు దిగింది. ఇందుకు సంబంధించి ఇరాన్ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. ఇరాక్, జోర్డాన్‌పై ఇరాన్ ప్రత్యేక సైనిక దళం ఐఆర్‌జీసీ దాడి చేసింది. కువైత్, బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించాయి. సిరిక్ ప్రాంతంలో అమెరికా దాడి వల్ల ఓ పెళ్లింట విషాదం సంభవించిందని ఇరాన్ మీడియా పేర్కొంది. ఓ చిన్నారి సహా నలుగురు మృతి చెందారని, 50 మంది గాయపడ్డారని తెలిపింది. ఈ ఉదంతంపై ఇరాన్ సుప్రీం లీడర్ మండిపడ్డారు. యూఎస్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. యూఎస్‌కు తమ సైన్యం మర్చిపోలేని గుణపాఠం చెబుతుందని ఐఆర్‌జీసీ ప్రతినిధి హుస్సేన్ మొహబి పేర్కొన్నారు. ఈ దాడులు ఎందుకు చేశామా? అని చింతించేలా చేస్తామని హెచ్చరించారు. అయితే, హోర్ముజ్‌లో కమర్షియల్ నౌకలపై ఇరాన్ దాడి చేసే ప్రయత్నం చేయడంతోనే తాము దాడులు చేయాల్సి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకూ దాడులు కొనసాగాయని పేర్కొంది. ఇక తమ భూభాగం వైపు వస్తున్న 13 బాలిస్టిక్ మిసైల్స్‌ను మార్గమధ్యంలోనే ధ్వంసం చేశామని జోర్డాన్ మిలిటరీ పేర్కొంది. మరో మూడు మిసైల్స్ నిర్మానుష్య ప్రాంతంలో కూలిపోయాయని తెలిపింది. ఇరాన్ దాడుల వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పింది. బుధవారం ఉదయం ఇరాన్ ప్రయోగించిన పలు మిసైల్స్‌ను అడ్డుకున్నామని మరో ప్రకటనలో కువైట్ తెలిపింది. బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించినట్టు తెలిసింది. అమెరికా దాడుల్లో చిన్నారి మరణించినట్టు ఇరాన్ మీడియాలో వార్తలు రావడంపై యూఎస్ సెంట్‌కామ్ ప్రతినిధి స్పందించారు. ఇరాన్ దళాల లాగా తాము సామాన్య పౌరులను ఏనాడు టా÷–గ్గ్÷ట్ చేయలేదని స్పష్టం చేశారు.

## నేపాల్‌లో మళ్లీ వర్షాలు

నేపాల్‌కు మరోసారి వరద ముప్పు పొంచి ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా మూడు ప్రధాన నదులలో నీటి మట్టాలు డేంజర్ మార్క్‌ను దాటాయి. నేపాల్ వరద అంచనా విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో సున్ కోషి, బుధి గండకి, మహాకాళి నదులలో నీటి మట్టాలు హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. లామ్‌జంగ్ జిల్లాలోని మార్స్యాంగ్డి నదిలో కూడా నీటి మట్టం మంగళవారం అర్ధరాత్రి డేంజర్ మార్క్ దాటిందని అధికారులు వెల్లడించారు. ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచించింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో నిరంతరం వర్షాలు కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. బుధవారం నాటికి నేపాల్, టిబెట్‌లలో కలిపి మరణాల సంఖ్య 1,130కి పెరిగింది.

## రాష్ట్రపతితో నితిన్ నబిన్ భేటీ

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ భేటీ అయ్యారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. ఇటీవల బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబిన్ మర్యాద పూర్వకంగా రాష్ట్రపతిని కలిసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలను నితిన్ నబిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈరోజు నేను గౌరవనీయ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గారిని మర్యాదపూర్వకంగా కలిశాను. యన సౌమ్య స్వభావం, దేశానికి చేసిన అచంచలమైన సేవ మనకు ఎంతో నేర్పుతాయి. ఆయన మార్గదర్శనం మన దేశం, సమాజం యొక్క ఉన్నతి కోసం అవిశ్రాంతంగా పనిచేయడానికి మనకు నూతన శక్తిని, స్ఫూర్తిని ఇస్తుంది.' అని నితిన్ నబిన్ రాసుకొచ్చారు.

## వైఎస్ వర్ధంతి సందర్భంగా నివాళులు
## తండ్రితో అనుబంధం తలచుకుంటూ
## జగన్ భావోద్వేగ పోస్ట్

డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా.. తెలుగు రాష్ట్రాల్లో ఆయన అభిమానులు, పలువురు నేతలు ఆయన్ని స్మరించుకున్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఓ భావోద్వేగ సందేశాన్ని పోస్టు చేశారు. 'మిస్ యూ ఆల్వేస్, డాడ్! యూ విల్ ఫరెవర్ బీ మై ఇన్‌స్పిరేషన్' అంటూ తండ్రిని తలచుకున్నారు. వైఎస్సార్ తనకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తారని జగన్ పేర్కొన్నారు. తండ్రితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ.. ఆయన జ్ఞాపకాలను స్మరించారు. అంతకు ముందు.. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ జగన్ కుటుంబ సభ్యులతో, పార్టీ కేడర్‌తో కలిసి నివాళులర్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన ఆయన.. ప్రజల మనసుల్లో 'వైఎస్సార్'ను చిరస్థాయిగా నిలబెట్టింది. అయితే 2009 సెప్టెంబర్ 2న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన కన్నుమూశారు. ఆయన మృతికి నేటితో పదిహేడేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌ను స్మరించుకుంటూ తెలుగు రాష్ట్రాల్లో నివాళులర్పిస్తున్నారు. ఇటు వైఎస్సార్ వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆయన అడుగుజాడల్లోనే సంక్షేమానికి పెద్దపీట వేశారు. తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ ఏపీకి ముఖ్యమంత్రిగా పేదలు, మహిళలు, రైతులు, విద్యార్థులు, వివిధ వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు.

# చేయించుకుంటే ఆపరేషన్లు కూడా దొంగ డాక్టర్లు చేస్తారు.

## నియంత్రణ నిఘా లేకపోవటమే వారు ఆడిందల్లా ఆట




**విజయవాడ, బ్యూరో చీఫ్ సెప్టెంబర్.2 నంది పత్రిక** దొంగ సర్టిఫికెట్లతో డాక్టరుగా చలామణి అవుతూ దశాబ్దాల నుండి వైద్యులుగా చలామణి అవుతున్న 11మంది దొంగ డాక్టర్లను హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ అధికారులు కనిపెట్టి అరెస్ట్ చేసిన తీరు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిందని చెప్పాలి. తమకున్న రోగం బాధను తగ్గించుకునేందుకు సహజంగా డాక్టర్లదగ్గరకు ఎంతో నమ్మకంతో రోగులు వెళతారు.వారు దొంగలా, అసలు డాక్టర్ల అని ఎలా గుర్తిస్తారు. అలా నమ్మకంతో వెళ్ళిన రోగికి ఏ వ్యాధికి ఏమందులివ్వాలో దొంగ డాక్టరుకి ఎలా తెలుస్తుంది.కనుక పదిరాళ్ళు విసిరితే ఒకరాయి తగలదా అన్నట్లు పదిరకాల మందులు,మహా వైద్యులమన్నట్లు అర్హత లేకున్నా కొందరు ఖరీదైన టెస్టులను రాయటం మామూలైపోయినట్లు ఆరోపణలున్నాయి.ఫలితంగా రోగులు అప్పులపాలు,దొంగ డాక్టర్లు మందులు,టెస్టుల ద్వారా భారీగా కమీషన్లు పొందుతూ ఆర్థిక బలం పుంజుకుని సమాజంలో అసలు డాక్టర్లకంటే అధిక వేషాలు వేస్తున్నది ఇలాంటి వారే.కారణం తనిఖీలు చెయ్యాల్సిన వారు ఇలాంటి వారి పట్ల తొంగి చూడకపోవటమే!అన్న ఆరోపణలున్నాయి.అసలు సిటీ స్కాన్,ఎం ఆర్ ఐ సెంటర్లలోకి వచ్చే ప్రిస్క్రిప్షన్లు అర్హత ఉన్న డాక్టర్లు రాస్తున్నారా లేక ఆర్ ఎం పి, పి ఎం పి,ఆయుర్వేద ప్రాక్టీస్ చేస్తున్నవారు రాశారా అనేది కనీసం చూడాల్సిన బాధ్యత నిర్వాహకులదే,అయితే ఎవరికి ఏమీ పట్టదు.వస్తె చాలు,తీయ్యటమే. గతంలో కృష్ణా జిల్లాలో అప్పటి ఎడిషనల్ ఎస్ పి గా ఉన్న వెంకటేశ్వర రావు ఒక తనిఖీ బృందాన్ని తయారుచేసి అనుమానం ఉన్న డిస్పెన్సరీలపై జరిపిన దాడులకు ఇలా నకిలీలు,అర్హతలేని వైద్యులు ఆఖరికి సిరంజి కాదుకదా సూది కూడా లేకుండా డిస్పెన్సరిల్లో తీసివేశారు.అప్పట్లో వైద్యం ఒకదారికి వచ్చి నిజంగా కావలసిన వారికి కావలసిన మందులు ఇవ్వటం జరిగింది.అనవసరపు టెస్టుల బాధకూడా తప్పింది.ఆయన బదిలీతో తనిఖీలు ఆగిపోయాయి.పరిస్థితి యథాతథం.ఇప్పటికైనా టాస్క్ ఫోర్స్ లేదా మరో సంబంధిత శాఖలు,ఆదాయపు పన్ను శాఖలు అడ్డగోలు సంపాదనకు అలవాటుపడిన అక్రమ వైద్యుల ఆసుపత్రులపైనా,టెస్ట్ లాబ్ పైనా దాడులు చేస్తే అడ్డగోలు సంపాదన ఏమిటో,రోగులు ఎలా మోసపోయి అప్పులబారిన పడుతున్నారో తేలుతుంది.ఒక పట్నంలో ఐదురూపాయలకే వైద్యం పేరుతో తనకు అనుబంధంగా ఉన్న ల్యాబ్ లో వున్నదిఉన్నట్లు కాక టైఫాయిడ్,మరో ఇన్ఫెక్షన్ ఉన్నట్లు చూపాలని,తద్వారా ఖం నుబంధంగా ఉండే మెడికల్ షాపులో నకిలీలు,సగానికి సగం లాభం ఉండే మందులు రోగులకు అంట కట్టి లేని వైద్యానికి వైద్యం పేరుతో వేల రూ పాయలు గుంజేవాడని, లాంటి 5రూపాయల వైద్యంలో ఏమి మిగులుతుందని అనేవాడట. సంతానంలేదని ఆయుర్వేదం కోసం వచ్చిన వారిని,దీర్ఘ వ్యాధి రోగుల కు మరొక వైద్యుడు చిలిపి వ్యాధులకు వైద్యం చేసే వారికంటే కూడా భార్యా భర్తలను వేరు వేరు సిట్టింగ్లు వేసి భయభ్రాంతులకు గురిచేసి భారీగా డబ్బులు గుంజినా పిల్లలు కలగటం,దీర్ఘవ్యాధులు తరం ఒక భ్రమే అని వాపోయినవారికి అప్పులే మిగిలాయి అని పలువురు పేర్కోవటం పరిశీలిస్తే రోగులు ఎలా కొందరి దొంగ వైద్యులు లేదా అర్హత లేకున్నా ఆర్థిక లాభాపేక్షతో రోగులను మోసం చేసే వారిని అదుపు చెయ్యాలని పలువురు కోరుతున్నారు. అందుకు తరచూ దాడులు చేసి వారి అర్హతలు ఏమిటి,వారు ఏవిధంగా రోగులను మోసం చేస్తున విషయాన్ని అరికట్టాలని కోరుతున్నారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

### జన్మదిన కేకు కట్ చేసిన జనసేన అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 2 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని ఇరి గెల బ్రదర్స్ వారి జనసేన పార్టీ కార్యాలయం నందు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి . జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి ఆళ్లగడ్డ పట్టణంలోని ఇరిగెల కార్యాలయంలో జనసేన తాలూకా సీనియర్ నాయకులు ఇరిగేలరామ పుల్లారెడ్డి ఆదేశాల మేరకు. తాలూకా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఇరి గెల సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం జనసేన నాయకులు కార్యకర్తల మధ్య ఘనంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఇరిగేల మాట్లాడుతూ జనసేన పార్టీ చీఫ్ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రజల అందరి ఆశీస్సులు ఆయనకు ఉండాలని ఆయన అంకితభావం పార్టీ పట్ల క్రమశిక్షణ మొక్కవోని ధైర్యంతో నాడు పార్టీని స్థాపించినప్పటి నుంచి నేటి వరకు అదే రీతిలో కొనసాగిస్తూ ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా పవన్ కళ్యాణ్ అంటే ఒక ట్రేడ్ మార్క్ అని పేర్కొన్నారు . ఈ సందర్భంగా ఆయనకు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ముక్కోటి దేవతల ఆశీస్సులు నరసింహస్వామి దీవెనలు నిండుగా మెండుగా కలకాలం ఉండాలని ఆయన కోరుకున్నారు ఈ కార్యక్రమంలో .మహబూబ్ హుస్సేన్ బాబు. పెసరవెయ్ చాంద్ భాషా. రత్నమయ్య. మహబూబ్ బాషా. రంగస్వామి. అంబటి వీర నారాయణరెడ్డి. పెద్ద బాలయ్య. తేజనాథ్. దొర్నిపాడు మండలం నాయకులు తిమ్మరాజు మద్దిలేటి.. హుస్సేన్ భాష.. మిట్టపల్లి ఉషెనయ్య ఉపేంద్ర ఎర్రగొండ చంద్రబాబు. ముల్లా మహబూబ్ షరీఫ్ జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com